Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 28 - No.5

March 2022



4లో

## టర్నింగ్ పాయింట్

# కీలక మలుపులు

1872 వేసవిలో ఐర్లాండ్‌లోని డబ్లిన్ సమీపంలో జరిగిన ప్రేయర్ మీటింగ్‌కి ప్రముఖ బ్రిటిష్ బోధకుడు హెన్రీవర్లీ, ప్రఖ్యాత అమెరికన్ సువార్తికుడు డి.ఎల్. మూడీలు వెళ్లారు. రాత్రంతా జరిగిన ప్రార్థనా సమావేశం తర్వాత ఉదయం హెన్రీవర్లీ మూడీతో "సంపూర్ణంగా దేవునికి సమర్పించుకున్న ఒక వ్యక్తి ద్వారా దేవుడు ఏమి చేయగలడో ఈ ప్రపంచం ఇంకా చూడలేదు" అని అంటాడు. హెన్రీవర్లీ చెప్పిన మాటలు మూడీ మనస్సులో చెరగని ముద్రవేశాయి. తర్వాత మూడి 'నాలో ఉన్న పరిశుద్ధాత్ముని ద్వారా నేను ఆ వ్యక్తిని అవుతాను' అని తన్ను తాను క్రీస్తుకు సమర్పించుకుంటాడు. ఈ సంఘటన డి.యల్. మూడీ పరిచర్య మొత్తానికి ఒక కీలక మలుపు.

యోసేపు తన తండ్రికి ప్రియమైన కుమారుడు. తండ్రి ఆదేశం మేరకు తన అన్నలను వెతుక్కొంటూ దోతానుకు వెళ్ళి వారిని కలుసుకొన్నాడు. యోసేపు అన్నలు ఆయన మీద కోపంతో గుంటలో పడవేసి, ఐగుప్తుకు బానిసగా అమ్మివేస్తారు. ఐగుప్తులో అంతా మంచిగా ఉందన్న సమయంలో అత్యాచారమనే నిందను ఎదుర్కొని చెరసాల పాలవుతాడు. తర్వాత కలలకు భావం చెప్పి, దేవుని చిత్త ప్రకారం ఐగుప్తుకు గొప్ప పరిపాలకుడు అయ్యాడు. యోసేపు జీవితంలో అనేక మలుపులు. వీటన్నిటిలో దేవునిని హెచ్చించి, పరిశుద్ధతను కాపాడుకొన్నాడు. చేదు అనుభవాలు, కష్టాల వెనుక దేవుడు తనకు తోడైవున్నాడని, ఆయన ప్రణాళిక ఉందని గ్రహించాడు.

శారా, రాహేలు, రూతు, మేరీ, సలోమి... లాంటి బైబిల్ స్త్రీల పేర్లున్న వాళ్ళు మనకు కనిపిస్తారు కానీ రాహాబు అనే పేరు కూడా బైబిల్ స్త్రీదే అయినా ఆ పేరు మనకు వినిపించదు. ఎందుకంటే ఆమె యెరికో పట్టణానికి చెందిన ఒక వేశ్య. నిజమే, ఒక వేశ్య పేరు ఎవరూ పెట్టుకోరు. వృత్తిని బట్టి సమాజం రాహాబును అత్యంత హీనమైన జాతికి చెందిన స్త్రీగా భావించినప్పటికీ 'సజీవుడైన దేవునికి భయపడి, ఆయన యందు విశ్వాసముంచి' యెరికో రాజుకు వ్యతిరేకంగా వేగులవారికి ఆశ్రయమిచ్చి, వారిని దాచడాన్ని బట్టి ఆమె జీవితంలో ఒక గొప్ప మలుపు సంభవించింది. దేవుడామెను కొత్తనిబంధనలో అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, దావీదు వంటి మహా విశ్వాసవీరులతో సమానంగా వారి జాబితాలో చేర్చి అత్యున్నతమైన జాతికి చెందిన స్త్రీగా హెచ్చించాడు (హెబ్రీ11:31).

"ఆలోచించగల ప్రజలకు" సువార్త చెప్పగలవా? అని ఒక క్రైస్తవ ప్రొఫెసర్, ప్రొఫెసర్ ఇనాక్‌గారికి ఈ సవాలును విసిరాడు. "చదువురాని వారికి సువార్త చెప్పి వారిని క్రైస్తవులుగా మార్చడం చాలా సులువు. ఎందుకంటే వారికి అంతకంటే ఏమీ తెలియదు. అదే చదువుకున్న వాళ్ళ దగ్గరకెళ్ళి చెప్పు చూద్దాం. వాళ్ళను ఒప్పించడం అంత సులభం కాదు". కొంతమంది స్నేహితులు కూడా ఆయనతో "దేవుడు నిన్ను స్టూడెంట్స్ మధ్య ఉంచాడు కాబట్టి వారికి సువార్త చెప్పడమే నీ మొదటి బాధ్యత. సాధారణ ప్రజలకు సువార్త చెప్పడానికి ఎందరో మిషనరీలూ, సువార్తికులూ ఉండనే ఉన్నారు" అని అన్నారు. ఈ మాటలు ప్రొఫెసర్. ఇనాక్‌గారి జీవితానికి ఒక టర్నింగ్ పాయింట్. ఫలితంగా ఆయన దృష్టి విద్యార్థుల మీదకీ, యూనివర్సిటీ ప్రొఫెసర్ల మీదకి మళ్ళింది. క్రీస్తు అడుగుజాడల్లో జీవిస్తూ, భారతదేశంలో నశించే విద్యార్థుల రక్షణ కోసం మరికొంతమంది స్నేహితులతో కలిసి కన్నీటితో ప్రార్థించి, పనిచేశాడు. ఆ ప్రార్థన ఫలితమే యుఇయఫ్ఐ ఆవిర్భావం.

టర్నింగ్ పాయింట్ అంటే లాంగ్‌మెన్ డిక్షనరీ ప్రకారం "ముఖ్యమైన మార్పు ప్రారంభమయ్యే సమయం, ముఖ్యంగా పరిస్థితిని మెరుగుపరచే సమయం" అని అర్థం. కోలిన్స్ డిక్షనరీ ప్రకారం ఒక వ్యక్తి లేదా వస్తువు యొక్క భవిష్యత్‌ను ప్రభావితం చేసే, ముఖ్యమైన మార్పు జరిగే సమయం". ఎక్కువ సానుకూల, మెరుగైన జీవన విధానం లేదా పరిస్థితి మొదలయ్యే సమయం.

ప్రతి వ్యక్తి జీవితంలో పుట్టింది మొదలు చనిపోయే వరకు అనేక మలుపులు ఉంటాయి. అవి మనం చేసే నిర్ణయాలు, ఎంపికలు, పనులు, పరిస్థితులను బట్టి ఆధారపడి ఉంటాయి. ఈ మలుపులు కొన్నిసార్లు ఆత్మీయంగా ఎదగడానికి, మన పరిస్థితి మెరుగవ్వడానికి, సమాజాన్ని ప్రభావితం చేయడానికైతే, కొన్నిసార్లు పతనానికి, మరికొన్నిసార్లు పడుతూ లేవడానికి దారితీస్తుంటాయి.

మన జీవితంలో పరిస్థితులు ఎలా ఉన్నా, మలుపులు ఎన్ని ఉన్నా ప్రతి మలుపులో, ప్రతి పరిస్థితిలో డి.యల్.మూడీలా 'సంపూర్ణంగా క్రీస్తుకు సమర్పించుకొందాం'. యోసేపులా 'దేవున్ని హెచ్చిస్తూ, పరిశుద్ధతను కాపాడుకొందాం'. రాహాబులా 'రాజుకు, పరిస్థితులకు భయపడక దేవుని యందు విశ్వాసముంచి, క్రీస్తువైపు, ఆయన వాక్యంవైపు తిరుగుదాం'. ప్రొ. ఇనాక్ గారిలా 'క్రీస్తు అడుగుజాడల్లో నడుస్తూ, నశించిపోయే విద్యార్థుల కొరకు కన్నీటి ప్రార్థన చేస్తూ, వారిని క్రీస్తుకై గెలుచుకొందాం'.

– పి. సునీల్ జాకబ్

# విద్యార్థి జ్వాల

Vol. 28, No.5 March 2022
A Publication of
UESI Publication Trust



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Dr. J. Subbarao - Sec., Litt.Dept.



CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com



GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPIC:

April : Goodness of Good Friday
May : Leadership
June : Problems of believing students
July : Imitating Christ
August : Patriotism

**Note:** Please send your writeups on or before
**10th of every month**





## లోపలి పేజీల్లో...


- కీలక మలుపులు - 2
- టర్నింగ్ పాయింట్ - 4
- మలుపు మంచికే - 7
- పశ్చాత్తాపం - 8
- అవకాశాల్ని జారవిడుచుకోవద్దు - 12
- క్రాస్ వర్డ్ పజిల్ - 15
- నా జీవితంలో టర్నింగ్ పాయింట్ - 16
- మన పరిచర్య - 17
- నిన్నటి మనుషులు - 21
- మలుపు - 22
- పరీక్షల వేళ ప్రిపరేషన్ ఎలా? - 24
- నిర్ణయాలు - 26
- కోశాధికారి లేఖ - 31
- మేలుకో మగువా - 32

**కవర్ కథనం**



# టర్నింగ్ పాయింట్

*"..నీ జనమే నా జనము నీ దేవుడే నా దేవుడు; నీవు మృతి బొందుచోటను నేను మృతిబొందెదను, అక్కడనే పాతిపెట్టబడెదను".* – రూతు 1:16,17

ఒక్క ఐడియా నీ జీవితాన్ని మార్చుతుందో లేదో కానీ ఒక నిర్ణయం మాత్రం ఖచ్చితంగా నీ జీవితానికి టర్నింగ్ పాయింట్ అవుతుందనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. దక్షిణాఫ్రికాలో న్యాయవాద వృత్తిని వదిలిపెట్టి భారత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేయాలన్న నిర్ణయం గాంధీజీ జీవితానికి ఒక టర్నింగ్ పాయింట్. ఆ నిర్ణయమే ఆయనను జాతిపితను చేసింది. తన స్వదేశాన్ని, తన వారిని విడిచి భారత దేశంలోని అనాథలను అక్కున చేర్చుకోవాలన్న నిర్ణయమే తన జీవితానికి ఒక టర్నింగ్ పాయింట్ గా మారి ఆగ్నేస్‌ను విశ్వమాతను చేసింది.

తల్లిదండ్రుల సలహాను పెడచెవినపెట్టి, దేవుని చిత్తానికి వ్యతిరేకంగా తీసుకొన్న నిర్ణయం, నాజీరు చేయబడిన సంసోను జీవితాన్ని ఎలా నాశనం చేసిందో మనందరికీ తెలుసు. జీవితంలో ఎదురయ్యే చిన్నపాటి ఒత్తిడులను తట్టుకోలేక క్షణికావేశంలో తీసుకొనే నిర్ణయాలు అనేకమంది విలువైన జీవితాలకు చరమ గీతం పాడుతుంది.

చిన్న పిల్లలనుండి ముసలివారి వరకు, అధికారుల నుండి పాలితులవరకు ప్రతి ఒక్కరం అనుదినము అనేక విషయాలలో మనకున్న ఆప్షన్స్‌నుండి నచ్చిన దానిని ఎంచుకొంటూ, దానికి అనుగుణంగా నిర్ణయాలు చేస్తుంటాము. సామాన్య విషయాలు, నిత్యకృత్యాలలో నిర్ణయాలు చేసేటప్పుడు ఎక్కువ చింతించాల్సిన పనిలేదు కానీ సంక్షోభ సమయాల్లో మాత్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, ఆలోచించి సరైనది ఎంపిక చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తోటివారు, శ్రేయోభిలాషులు ఎవరికి తోచిన సలహా వారు ఇవ్వటమేకాక పరిస్థితులను ఆసరాగా చేసుకొని నిన్ను ప్రభావితం చేయాలని చూస్తుంటారు. అయితే నీవు ప్రార్థనాపూర్వకంగా, దేవుని వాక్యానికి

అనుగుణంగా నిర్ణయాలు చేయకపోతే కలిగే నష్టాన్ని మాత్రం మనమే అనుభవించాల్సి ఉంటుంది.

రూతు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోవలసి వచ్చిన ప్పుడు దేనిని ఎంచుకొందో, ఎలాంటి నిర్ణయం తీసుకొందో, దాని పర్యవసానాలేమిటో వాక్యపు వెలుగులో చూద్దాం.

## ఆమె నేపథ్యం

యూదా బెత్లెహేములో కరవు కలిగినప్పుడు ఎలీమెలెకు తన భార్య నయోమి, ఇద్దరు కుమారులు మహ్లోను, కిల్యోనులతో కలసి మోయాబు దేశంలో కాపురముండడానికి వెళ్ళాడు (రూతు 1:1-2). ఎలీమెలెకు చనిపోయాక, అతని కుమారులు మోయాబు స్త్రీలైన ఓర్పా, రూతులను వివాహము చేసుకొన్నారు. ఇంచుమించు పది సంవత్సరాలకు వారిరువురు కూడా మరణించగా ముగ్గురు స్త్రీలు విధవరాండ్రుగా మిగిలిపోయారు. ఎంత దయనీయమైన పరిస్థితి!

## మోయాబీయులు ఎవరు?

లోతు పెద్ద కుమార్తె తన తండ్రి ద్వారా అక్రమంగా కనిన కుమారుడైన మోయాబు సంతతే మోయాబీయులు (ఆది 19:33-38). మోయాబీయులకు, ఇశ్రాయేలీయులకు మధ్య ఎప్పుడూ పోరాటాలే. అంతేకాక ఇశ్రాయేలీయుల అరణ్య ప్రయాణంలో మోయాబు మైదానములో దిగినప్పుడు, మోయాబు రాజైన బాలాకు, వారిని శపించటానికి బిలాముకు బహుమానమిచ్చి పిలిపిస్తాడు (సంఖ్య 22-24అ.). ఆ కారణాన యెహోవా దేవుడు మోయాబీయులలో పదియవ తరము వారైనను యెహోవా సమాజములో చేరకూడదని, ఇశ్రాయేలీయులు వారి క్షేమమైనను, మేలైనను విచారింపకూడదని ఆజ్ఞాపించాడు (ద్వితీ 23:3-6). దీనికితోడు ఇశ్రాయేలీయులు షిత్తీములో దిగినప్పుడు, ప్రత్యేకించి మోయాబు స్త్రీలు, వారిని మరులుగొల్పి తమతో వ్యభిచరించడానికి ప్రోత్సహించడంతోపాటు, యెహోవాకు హేయమైన కెమోషు (1 రాజు 11:33; 2 రాజు 23:13), బయల్పెయోరు (సంఖ్య 25:2-3) అను తమ దేవతలను ఆరాధించేటట్లు మోసపుచ్చారు (సంఖ్య 25అ). అటువంటి జనాంగంలోనుండి నయోమి కోడండ్రను తెచ్చుకొంది. దేవునికి ఇష్టంకాని నిర్ణయం వలన ఎలీమెలెకు కుటుంబం ఎంతో నష్టపోయిందని మనం గమనించగలం.

## ఆమె జీవితంలో గొప్ప మలుపు

యూదా దేశంలో పరిస్థితులు చక్కబడ్డ విషయం విన్న నయోమి తన ఇద్దరు కోడళ్ళతో కలసి తన స్వదేశానికి తిరుగు ప్రయాణమైంది. ఆమె తన కోడండ్ర భవిష్యత్తు గురించి ఆలోచించి వారి మేలు కోరి మార్గమధ్యంలో వారిద్దరినీ తమ తల్లిదండ్రుల వద్దకు తిరిగి వెళ్ళి మంచి జీవితాన్ని జీవించాలని కోరుతుంది. అంతేకాక తనతో రావటం వలన కలిగే నష్టాలగురించి కూడ వివరించి వారు వెనుకకు తిరిగేందుకు ఒప్పించడానికి ప్రయత్నిస్తుంది. ఈ క్రమంలో ఓర్పా అత్తకు వీడ్కోలు పలికి వెనుదిరిగి వెళ్ళిపోయింది (రూతు 1:6-14). కానీ రూతు మాత్రం నయోమితోనే తన ప్రయాణమని గట్టిగా తీర్మానించుకొని తన నిర్ణయాన్ని తెలియజేసింది. “నా వెంబడి రావద్దనియు నన్ను విడిచిపెట్టుమనియు నన్ను బ్రతిమాలుకొనవద్దు. నీవు వెళ్ళు చోటికే నేను వచ్చెదను, నీవు నివసించుచోటనే నేను నివసించెదను, నీ జనమే నా జనము నీ దేవుడే నా దేవుడు నీవు మృతిబొందుచోటను నేను మృతిబొందెదను, అక్కడనే పాతిపెట్టబడెదను. మరణము తప్ప మరి ఏదైనను నిన్ను నన్ను ప్రత్యేకించినయెడల యెహోవా నాకు ఎంతకీడైన చేయునుగాక అనెను” (రూతు 1:16-17). ఈ నిర్ణయం రూతు జీవితాన్ని పూర్తిగా మార్చేసిన ఒక గొప్ప మలుపు.

సంక్షోభాలు ఎదురైనప్పుడు ఎలాంటి ఆందోళనకు, ఒత్తిడికి లోనుకాకుండా ప్రార్థనాపూర్వకంగా, ప్రశాంతంగా ఆలోచించాలి (ఫిలి 4:6-7). ఆ పరిస్థితిని ఎదుర్కోవడానికున్న వివిధ అవకాశాలు లేదా మార్గాల గురించి క్షుణ్ణంగా పరిశీలించి తెలుసుకోవాలి. మనం చేసే ఎన్నిక దేవుని వాక్యానుసారమైనదో కాదో, దేవుని నామానికి మహిమ తెస్తుందో లేదో చూసుకోవాలి (1 కొరింథీ 10:31). అటువంటి సంక్షోభాలలో బైబిల్‌లోని భక్తులు, దైవజనులు ఎటువంటి ఎంపికలు చేశారో తెలుసుకోవటం మనకు మార్గదర్శకంగా ఉంటుంది.



రూతు వివాహం కొరకు యూదా మతాన్ని స్వీకరించి ఉంటుందని చరిత్రకారుల అభిప్రాయం. అంటే ప్రారంభంలో యెహోవా దేవునిగూర్చిన సరియైన అవగాహన ఉండి ఉండకపోవచ్చు. పదేళ్ళ వైవాహిక జీవితంలో తన భర్త, అత్తల ద్వారా దేవుని ఔన్నత్యం, ఆయన ఇశ్రాయేలు జనాంగాన్ని ఐగుప్తు దాసత్వంనుండి విడుదల చేసిన విధానం, అరణ్య ప్రయాణంలో ఆయన చేసిన అద్భుతాల గురించి విని ఉండవచ్చు. ఏది ఏమైనా, తన ప్రస్తుత భవిష్యత్ అంధకారమయమైనప్పటికీ సజీవుడైన దేవుని వెంబడించటానికి సిద్ధపడింది. తన సహోదరి ఓర్పా ఈ లోక సంబంధమైన విషయాలను పరిగణనలోకి తీసుకొని వెనుకకు వెళ్ళింది. ఆ దృష్టికోణంలో చూసినప్పుడు రూతు ఎంపిక సరైనదిగా కనిపించదు. కానీ రూతు సరియైన మార్గాన్ని ఎంపిక చేసుకొందన్న విషయం చివరలో అర్థమవుతుంది. ఆమె జీవితంలో దేవుని ప్రణాళిక నెరవేరడం స్పష్టంగా చూస్తాం. బోయజు ఆమెను విమోచించి వివాహం చేసుకోవడం, వారినుండి గొప్ప రాజు, దేవుని హృదయానుసారుడని పిలువబడిన దావీదు, అదే వంశంలోనుండి లోక రక్షకుడైన యేసు క్రీస్తు జన్మించడం దేవుని అనాదికాల సంకల్పం కాక మరేమిటి? శపించబడిన వంశంలోనుండి వచ్చిన రూతు ఇశ్రాయేలు జనాంగంలోనికి చేర్చబడడానికి ప్రధాన కారణం ఆమె తీసుకొన్న నిర్ణయమే. దేవున్ని ఘనపరచే విధంగా తీసుకొన్న నిర్ణయం ఆమె జీవితానికి ఒక టర్నింగ్ పాయింట్. ఓర్పా ఎంపిక తన దృష్టికి, లోకం దృష్టికి యధార్థంగా కనిపించి ఉండవచ్చు కానీ తర్వాత ఆమె ఏమైందో మనకి తెలియదు. సామె 14:12; 16:25 వచనాలలో ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు, అయితే తుదకు అది మరణమునకు దారితీయును అని స్పష్టంగా తెలుపబడింది. జీవితంలో, ప్రత్యేకించి సంక్షోభ సమయాల్లో మనం చేసే కొన్ని నిర్ణయాలు/ఎంపికలు జీవితాన్ని గొప్ప మలుపు తిప్పుతాయని రూతు జీవితం స్పష్టంచేస్తుంది.

## నా జీవితంలో ఎదురైన కొన్ని సంక్షోభాలు మరియు ఎంపికలు

ముఖ్యంగా చదువు, ఉద్యోగము, వివాహము మొదలైన విషయాలలో మన ఎంపికలు, మనం చేసే నిర్ణయాలు మన జీవిత గమనాన్ని నిర్దేశిస్తాయి. ఈ విషయాలలో నా ఎంపికలు నా జీవితాన్ని గొప్ప మలుపు తిప్పాయి. పాఠకులకు స్ఫూర్తిదాయకంగా ఉండేందుకు మీతో పంచుకోవాలనుకొంటున్నాను.

**చదువు:** ఆర్గానిక్ కెమిస్ట్రీతో యమ్.యస్.సి. పూర్తి చేశాక మద్రాసు ఐ.ఐ.టిలో రీసెర్చ్ చేయటానికి, ఎలాంటి కోచింగ్ లేకుండా, ఇండియా లెవెల్‌లో పరీక్ష రాసి ఓపెన్ కేటగిరిలో జాయిన్ అయ్యాను. దానికి కొంచెం ముందు నా క్లోజ్ ఫ్రెండ్ అంతు తెలియని వ్యాధితో మరణించింది. ఒక కజిన్ మెనింజైటిస్‌తో చావు బ్రతుకుల మధ్య వెల్లూరు ఆసుపత్రిలో ఉంది. ఆ రెండు సంఘటనలు నామీద తీవ్ర ప్రభావాన్ని చూపించాయి. జీవితం, మరణం, దేవుడు మొదలైన వాటి గురించి, సీరియస్‌గా ఆలోచించడం వలన కొద్ది నెలలలోనే నా ఆరోగ్యం దెబ్బతింది. అప్పుడు నా ముందు రెండు ఆప్షన్స్ ఉన్నాయి. కెరీర్‌పరంగా మంచి భవిష్యత్తుకొరకు ఆరోగ్యాన్ని లెక్కచేయక రీసెర్చ్ కొనసాగించడం, ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ ఇంటికి తిరిగి వెళ్ళటం. ఆ సమయంలో నేను రెండవ దానిని ఎంచుకొన్నాను. అక్కడే ఉంటే కెరీర్‌లో ఉన్నత స్థానాలకు వెళ్ళి ఉండేదాన్ని కానీ నిత్యజీవం ఉండేదికాదు. నాజీవితంలో ఇది చాలా గొప్ప మలుపు.

**వివాహము:** హైందవ కుటుంబంనుండి రావడం వలన నా తల్లిదండ్రులు క్రైస్తవ వివాహానికి అంగీకరించరు. అందుకని ఒంటరిగా ఉండిపోవాలనుకొన్నాను. కానీ అది దేవుని ప్రణాళిక కాదని తెలుసుకొన్నాక, వివాహ విషయంలో పెద్ద సమస్యే ఎదురైంది. ఒక వైపు నేను ప్రేమించే నా కుటుంబం, మరోవైపు నా కొరకు ప్రాణం పెట్టిన యేసయ్య. యేసు ప్రభువును నా స్వంత రక్షకునిగా అంగీకరించిన సంవత్సరానికే గొప్ప సవాలు. నా

తల్లిదండ్రులు విషం తీసుకొని చనిపోతామన్నా భయపడక దేవుని వాగ్దానాలమీద ఆధారపడి నిలబడి దేవుని చిత్తానుసారంగా ఆర్. ప్రభుదాస్ గారిని వివాహం చేసుకొన్నాను. తరువాత ఎన్ని కష్టాలు, శ్రమలు ఎదుర్కోవాల్సి వచ్చినా దేవుని సహాయంతో వాటన్నిటిని అధిగమించి తెనాలిలో ఓపెన్ హోమ్‌గా ఉండగలిగాము.

**ఉద్యోగము:** వివాహ సమయానికి మేమిద్దరం వేర్వేరు ప్రదేశాలలో పనిచేసేవారం. తర్వాత కుటుంబంగా సెటిల్ కావడానికి, దాదాపు 5 సంవత్సరాలుగా నేను చేస్తున్న ఉద్యోగాన్ని విడిచి తెనాలి రావాలనుకొన్నప్పుడు ఫ్రెండ్స్ సెలవు పెట్టి వెళ్ళమని, కొంతకాలం ఆగమని రకరకాల సలహాలిచ్చారు. కానీ మేము దేవుని వాగ్దానాలను నమ్మి రిజైన్ చేసి వచ్చినప్పుడు, దేవుడు మమ్మల్ని, మా పరిచర్యను ఎంతగానో ఆశీర్వదించాడు.

## సంక్షోభాలలో మన స్పందన

సంక్షోభాలు ఎదురైనప్పుడు ఎలాంటి ఆందోళనకు, ఒత్తిడికి లోనుకాకుండా ప్రార్థనా పూర్వకంగా, ప్రశాంతంగా ఆలోచించాలి (ఫిలి 4:6-7). ఆ పరిస్థితిని ఎదుర్కోవడానికున్న వివిధ అవకాశాలు లేదా మార్గాల గురించి క్షుణ్ణంగా పరిశీలించి తెలుసుకోవాలి. మనం చేసే ఎన్నిక దేవుని వాక్యానుసారమైనదో కాదో, దేవుని నామానికి మహిమ తెస్తుందో లేదో చూసుకోవాలి (1 కొరిం 10:31). అటువంటి సంక్షోభాలలో బైబిల్‌లోని భక్తులు, దైవజనులు ఎటువంటి ఎంపికలు చేశారో తెలుసుకోవడం మనకు మార్గదర్శకంగా ఉంటుంది. నిపుణులు, అనుభవజ్ఞులు, ఆత్మీయంగా పరిణితి చెందిన సీనియర్ గ్రాడ్యుయేట్ లేదా మెంటర్ సలహా తీసుకోవచ్చు. చెల్లించాల్సిన మూల్యం తెలుసుకొని ఎంపిక చేసుకొంటే భవిష్యత్తులో ఎలాంటి కష్టాలు, శ్రమలు ఎదురైనా చింతించము. కొన్నిసార్లు మన ఎంపిక లోకం దృష్టిలో వెఱ్ఱితనంగా కనిపించవచ్చు కానీ అది దైవచిత్తానుసారమైనదైతే ఆయన తోడు, ఆశీర్వాదాలు మనతో ఉంటాయి. దేవుని సంతోషపెట్టామనే తృప్తి ఉంటుంది. దేవుని ప్రియబిడ్డలంగా ఆయన మహిమార్థమై రూతువలె ఆలోచించి సరియైన ఎంపికలు చేయడానికి మనకందరికి దేవుడు కృపననుగ్రహించునుగాక!

– వి. గౌరికుమారి, తెనాలి

కవిత

# మలుపు మంచికే



ఏమో!
ఎవరికి తెలుసు?
ఒక చిన్న సంఘటనతో
అసాధారణ మార్పురావచ్చు
అంతులేని కృప పొందవచ్చు
అరచేయంత చిన్న మేఘం
కుండపోత వాన కురిపించవచ్చు
ఆనందాల వెల్లువ పారించవచ్చు
కరుకు శ్రమల కఠిన మలుపులు
మృదువైన కనికరబాటలో నడిపించవచ్చు
సేదదీర్చే పచ్చికకు దారితీయవచ్చు

కన్నతండ్రి కలల రాకుమారుడు
యోసేపు అనుకోలేదు
అన్నల కుట్రకు బలవుతానని
పరాయి దేశంలో బానిసగా బతుకుతానని!
ఆశ్చర్యకరుని తోడు అనుక్షణం దొరికింది
అత్యద్భుతం జరిగింది
ఆ దేశాన్నే ఆదేశించేవాడయ్యాడు
కరువులో అన్నలతోపాటు
ఎందరికో దిక్కయ్యాడు
అన్నోళ్ళ కళ్ళు తెరిపించాడు.

పాలుగారే బుగ్గల బాలుడు దావీదు
పాలించే వాడయ్యాడు
పాటలు పాడుకునే గొర్రెలకాపరి
పదివేలకొలది పాటగా మారాడు
గులకరాయితో మొదలైన యుద్ధంతో
శత్రువుల గుండెల్లో గునపమయ్యాడు
కారణం... ప్రతి మలుపులో
పాదం తొట్రిల్లనీయని ప్రభుని నమ్మడమే
ప్రాణమిచ్చే కాపరిపై ఆనుకోవడమే.

విశ్వాసంతో వినయం చూపిస్తే
విజయం పొందవచ్చు
అలసిన హృదయాలు
ఆదరణకర్త దగ్గర ఓదార్పు పొందవచ్చు
అలాకాకుండా...
కన్నీటి కష్టాల మెలికల బాటలో
తిన్నగా పోతానంటే
ఆవేదన లోయలో పడి దారికోల్పోవచ్చు
నిరాశా కొండకు ఢీకొని ముక్కలై పోవచ్చు!

– గొంగటి మేరీ జాయ్, ఆదోని



ప్రత్యేకం

# పశ్చాత్తాపం

## జీవితానికి గొప్ప మలుపు

పేతురు, యూదా ఇద్దరూ క్రీస్తు శిష్యులే, ఇద్దరూ తప్పుచేశారు, పేతురు పశ్చాత్తాపపడ్డాడు. క్రీస్తు కొరకు గొప్ప కార్యాల్ని, పరిచర్యను చేసి క్రీస్తు కొరకు హతసాక్షి అయ్యాడు. పశ్చాత్తాపం లేని యూదా తన జీవితాన్ని ముగించుకొన్నాడు. వారిద్దరి జీవితాన్ని గూర్చిన విశ్లేషణ, ముగింపు చూద్దాం.

### యూదా ఇస్కరియోతు

ఇస్కరియోతు అంటే కరియోతు నుండి వచ్చినవాడని అర్థం (యిర్మీయా 48:23). ఈ కరియోతు మోయాబు దగ్గర ఉంది. కరియోతు – హెబ్రోను (యెహోషువ 15:25) నుండి ఇస్కరియోతు వచ్చాడు అని రెండవ భావన. ఇది దక్షిణ హెబ్రోనుకు 19 కిలోమీటర్ల దూరంలో ఉంది. అతను అరమిక్ భాషలో పిలిచే ఇస్కరియోతు నుండి వచ్చాడని భావన. ఇస్కరియోతు అనే పదం అరమిక్ మూలం 'స్కారియో'. అంటే చంపేవాడు అని అర్థం. ఇది యూదా ఇస్కరియోతుకు సరిగ్గా సరిపోతుంది. యేసును చంపడానికి అమ్మివేసిన వ్యక్తిగా మనం గ్రహిస్తాం.

### యేసు పిలుపు - ఇస్కరియోతు వ్యక్తిత్వం

యేసు మిగతా 11 మంది శిష్యులులాగానే తనను వెంబడించడానికి యూదా ఇస్కరియోతును పిలిచాడు. వెంబడించే సామర్థ్యం ఉన్న శిష్యుడుగా ఇస్కరియోతు ఉన్నాడు. యేసు పిలుపును మనం సందేహించాల్సిన అవసరం లేదు. శిష్యత్వం వెల చెల్లించాల్సిన విషయం. పేతురు, యూదా ఇద్దరూ విభిన్న నేపథ్యాల నుండి వచ్చారు. యేసు శిష్యులుగా ఉండడం వారికి ఆధిక్యత. పేతురు చాలా స్వచ్ఛంగా ఏ ఉద్దేశాలు లేకుండా యేసుని వెంబడించాడు. యూదా ఉద్దేశాలు వేరు. యూదాకి అధికారం, డబ్బు కావాలి. యేసు కొన్నిసార్లు వ్యంగ్యంగా విమర్శించిన సందర్భాలు ఉన్నాయి. నీవు లోకమునకు మాకు మాత్రమే కనబరచుకొనుటకు నీకేమి సంభవించెను అని అడగడంలో యూదా ఉద్దేశం యేసు లోకానికి రాజకీయ విమోచకుడుగా, ఇశ్రాయేలీయులను రోమా ప్రభుత్వ పాలన నుండి విమోచించేవాడుగా భావించాడు. ఆయనను ఆత్మీయ మెస్సీయ్యగా కాకుండా రాజకీయ మెస్సీయ్యగా భావించాడు.

ఇస్కరియోతు యూదా 12 మంది శిష్యులలో ఒకడు. యేసు చేత శిష్యుడుగా కొనసాగడంలో విఫల మవ్వడానికి యేసుక్రీస్తు మెంటరింగ్ వైఫల్యమా? అంటే కాదు. యేసు బోధలు యూదా విన్నాడు. అద్భుతాలు చూశాడు గాని, యేసును గూర్చి అతని అవగాహనలో, అభిప్రాయంలో మార్పు లేదు. తన మనస్సు మార్చుకోలేదు.

శిష్యబృందంలో యూదా కోశాధికారి (యోహాను 12:6; 13:29). డబ్బు సంచి అతని దగ్గర ఉండేది. వాడు దొంగైయుండి దానిలోనిది దొంగిలుతూ వచ్చాడు. మరియ యేసు పాదాలను ప్రశస్తమైన అత్తరు పూసినప్పుడు విమర్శిస్తాడు. దానిని 300 దేనారాలకు అమ్మి బీదలకు ఇయ్యవచ్చు గదా అని అతని ఆలోచన. యోహాను అతనికి బీదల మీద శ్రద్ధ లేదని రాశాడు.

యూదా నాశనపుత్రుడు (యోహాను 17:12) సాతాను(యోహాను 6:70). అపవాది హృదయంలో తలంపు పుట్టించాడు (యోహాను 13:27). సాతాను వానిలో ప్రవేశించెను అని వాక్యంలో రాయబడింది. తన లోకాశలన్నీ భగ్నమై నిరాశ వల్ల యేసుని తిరస్కరించి, ద్వేషించేటట్టు చేసింది. యూదా యేసును అప్పగించడానికి తగిన సమయం కోసం వేచి చూస్తున్నాడని రాయబడింది. ఇందుకోసం యాజకులతో రహస్య ఒప్పందం కుదుర్చుకొన్నాడు. నేను ఆయనను అప్పగిస్తే మీరు నాకేమి ఇస్తారని అడగడంలో యూదా ధనాపేక్ష కనిపిస్తుంది. ఇది గురుద్రోహం అందుచేత ద్రోహియగు ఇస్కరియోతు యూదా అని రాయబడింది.

## శిష్యుడుగా ఇస్కరియోతు యూదా

యేసుని వెంబడించడంలో యూదా ఉద్దేశాలు సరైనవి కావు. అవి పరలోక ఉద్దేశాలు, పవిత్రమైన ఉద్దేశాలు కావు. యూదా యేసుక్రీస్తుని తన జీవితంలోకి ప్రభువుగా అంగీకరించలేదు. బోధకుడా అని సంబోధిస్తాడు (మత్తయి 26:25). యేసుని అమ్మి వేయాలనే తలంపును క్రియారూపంలో పెట్టి సాతానుకు అవకాశమిచ్చాడు. ధనాపేక్ష, దొంగతనం, అధికార కాంక్ష, యేసు అధికారం క్రిందకు రాకపోవడం మొదలైనవి ఇస్కరియోతు యూదా విఫలమవ్వడానికి గల కారణాలు.

## ఇస్కరియోతు యూదా ముగింపు

యేసును అమ్మివేసిన తరువాత అతడు చేసింది



తప్పు అని అర్థమైంది. అప్పటివరకు సాతాను వాని మనోనేత్రాలు మూసివేశాడు. అయితే యూదా తీవ్రమైన మనోవిచారం, అపరాధ భావనతో ఉరి పోసుకొని చనిపోయాడు. యూదాకు ఇంకా ద్వారం తెరిచే ఉంది కానీ ఆ అవకాశాన్ని ఉపయోగించుకోక సాతానుకి అవకాశం ఇచ్చాడు. కాబట్టి సాతాను యూదాను ఉరి వేసుకొనేటట్లు ప్రోత్సహించాడు (అ.కా. 1:18). నేను నిరపరాధి రక్తం చిందించి పాపం చేశానని గ్రహించాడు (మత్తయి 27:4).కానీ యేసు దగ్గరికి వచ్చి తన పాపాన్ని ఒప్పుకోలేదు. యేసుకి వ్యతిరేకంగా చేశాడు కాబట్టి ఆయన దగ్గర ఒప్పుకోవాలి. ఇంగ్లీష్ బైబిల్లో దీనిని 'రిమోర్స్, సారో' అని రాశారు. తీవ్రమైన మనోవ్యధ, అపరాధభావన, స్వయం నింద అని దీనికి అర్థం.

## పేతురు

పేతురు అసలు పేరు సీమోను. బేత్సయిదాకు చెందినవాడు (యోహాను 1:44). గలిలయలో కపెర్నహోములో అతనికి సొంతగృహముంది (మార్కు 1:29). అతనికి వివాహం అయ్యింది (మార్కు 1:30). పరిచర్య తొలినాళ్ళలో భార్యను వెంటబె ట్టుకొని తిరిగాడు (1 కొరింథీ 9:5). అతని తండ్రి పేరు యోనా (మత్తయి 16:17). అతని సహోదరుని పేరు అంద్రెయ. యేసు శిష్యుడుగా ఉండకముందు బాప్తీస్మమిచ్చు యోహాను యొక్క శిష్యుడుగా ఉన్నాడు (యోహాను 1:39). వృత్తిరీత్యా పేతురు జాలరి. ధర్మశాస్త్రంలో శిక్షణ పొందలేదు. అరమిక్ గ్రామీణ భాష మాట్లాడేవాడు (మార్కు 14:70). యేసు

పేతురు పేరును 'కేఫా'గా మార్చాడు. కేఫా అనే మాటకు 'రాయి' అని అర్థం.

## శిష్యుడుగా పేతురు

యేసు అంతరంగ శిష్యులలో పేతురు ఒకనిగా ఉన్నాడు. ఒక చిన్నదాన్ని యేసు బ్రదికించినప్పుడు, రూపాంతర కొండకు యేసు పేతురును, యాకోబును, యోహానును మాత్రమే వెంటబె ట్టుకొని వెళ్ళాడు.

నా శరీరము తిని, నా రక్తము త్రాగువారు నిత్యము జీవించును అని చెప్పినప్పుడు అనేకమంది అభ్యంతరపడి వెళ్ళిపోతారు, అప్పుడు యేసు మీరు కూడా వెళ్ళవలెనని ఉన్నారా అంటే ప్రభువా ఎవనియొద్దకు వెళ్ళుదము. నీవే నిత్యజీవపు మాటలు గలవాడవు. నీవు దేవుని పరిశుద్ధుడని విశ్వసించి, యెరిగియున్నామని యేసుతో చెబుతాడు.

## పేతురుకు గురువుగారైన యేసు పట్ల ఉన్న ప్రేమ

యేసు చావడం ఇష్టం లేదు. యేసును అప్పగిం చడానికి, యూదా సైనికులతో వచ్చినప్పుడు తన గురువు గారిని కాపాడుకోవడానికి ప్రధానయాజకుని దాసుడైన మల్కును కొట్టి అతని కుడి చెవి తెగ నరకడం, యేసు అప్పగింపబడిన తరువాత ఆయనకేమి జరుగుతుందో తెలుసుకోవడానికి (లూకా 22:54) ఆయనను దూరం నుండి వెంబడించడం, అతనికి గురువుగారి పట్ల ఉన్న ప్రేమ, శ్రద్ధను తెలియచేస్తాయి.

## పేతురు స్వభావం - యేసుని వెంబడించడం

పేతురుకు యేసుని వెంబడించడంలో ఎలాంటి స్వలాభాపేక్ష లేదు. స్వచ్ఛమైన మనస్సుతో ఖాళీ హృదయంతో యేసుని వెంబడిస్తాడు. ఆయనకు భవిష్యత్ భయం తప్ప మరేదీ లేదు. ఇది అందరి కి ఉండేదే.



పేతురు యేసు అధికారం క్రిందకు రావడం, ప్రతిసారి ప్రభువా అని సంబోధించడం, ఆయనను ప్రేమించడం, పాపం చేసినప్పుడు పశ్చాత్తాపపడటం ఆయన జీవితంలో గొప్ప మలుపు. పేతురు వెనుకకు వెళ్ళిపోయే వ్యక్తి అయినప్పటికీ యేసు అతనిని వెంబడించి స్థిరపరచి, బలపరచి పునరుద్ధరించాడు. పేతురు నమ్మిక తప్పిపోకుండా యేసు ప్రార్థించాడు.

## పేతురు జీవితంలో, పరిచర్యలో అద్భుతాలు

యేసు ఆరోహణమైన తరువాత పేతురు పెంతెకొస్తు దినాన్న ప్రసంగం చేస్తే 3,000 మంది రక్షణ పొందారు. పేతురు భాషలతో మాట్లాడాడు. శృంగారమనే దేవాలయం దగ్గర కుంటివాడిని స్వస్థపరచాడు. పేతురు జైలులో ఉంచబడినప్పుడు అద్భుతంగా దేవుని దూత అతనిని విడిపించాడు. దొర్కా అనే విధవరాలు చనిపోతే పేతురు తిరిగి బ్రతికిస్తాడు. రెండుసార్లు చేపలు పట్టడంలో విఫల మై యేసు మాటను బట్టి విస్తారమైన చేపలు పడతాడు. యేసును మాటను బట్టి సముద్రం మీద నడుస్తాడు.

## పేతురు అనాలోచితంగా మాట్లాడటం

పేతురు కొన్నిసార్లు దేవుని ప్రభావంలో, మరి కొన్నిసార్లు సాతాను ప్రభావంలో ఉన్నట్లు కనిపిస్తుంది. నా గూర్చి జనులు ఎవరని చెప్పుకొంటున్నారని అడిగి నప్పుడు నీవు సజీవుడవైన దేవుని కుమారుడవైన క్రీస్తువు అని చెపుతాడు. నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపరచాడే కానీ నరులు కారు అని యేసు ప్రశంసించాడు. నీవు ధన్యుడవు అని చెప్పడం, అతడు దేవుని ప్రభావంలో ఉండడం, దేవుని ప్రత్యక్షతలో ఉండటం మన గమనిస్తాము. రూపాంతర కొండ మీద మనమిక్కడ ఉండడం మంచిది అని అనాలోచితంగా మాట్లాడతాడు. మనుష్యకుమారుడు యెరూషలేముకు వెళ్ళి పెద్దలచేత ప్రధానయాజకులచేత అనేక హింసలు పొంది చంపబడి మూడవ దినమున లేచును అని చెప్పగానే ఆయన చేయి పట్టుకొని, అది దూరమగుగాక అది నీకెన్నడు కలుగదని గద్దింపసాగాడు. యేసు మరణమవ్వడం పేతురుకు ఇష్టం లేదు. ఇందులో ప్రేమ ఉన్నప్పటికీ అది సాతాను తలంపు. అందుచేత సాతానా నా వెనుకకుపొమ్ము? అని పేతురుని గద్దించి

అది మనుష్య తలంపు అంటాడు. ఇక్కడ కూడా పేతురు యేసును ప్రభువా అని సంబోధిస్తాడు. పేతురు సాతాను ప్రభావంలో ఉన్నాడని మనం గ్రహించవచ్చు.

## పేతురు బొంకడం

పేతురు పిరికివాడు. అనాలోచితంగా మాట్లాడతాడు. రెండుసార్లు వెనక్కు వెళ్ళిపోయాడు (లూకా 5, యోహాను 21). పేతురు బలహీనచిత్తం గలవాడు. యేసుక్రీస్తు గురించి అందరూ అభ్యంతరపడినను నేను అభ్యంతరపడను అని డాంబి కాలు పలికాడు. యేసుని ఎరుగనని మూడుసార్లు బొంకాడు. ఆ తరువాత పేతురు పశ్చాత్తాపపడి, సంతాపపడి ఏడుస్తాడు. తన్ను తాను సరిచేసుకొని గొప్పగా దేవుని పరిచర్య చేసి హతసాక్షి అవుతాడు.

## పశ్చాత్తాపం, దాని ఆవశ్యకత

పాతనిబంధనలో పశ్చాత్తాపం అంటే మనస్సు మార్చుకోవడం, దేవునివైపు తిరగడం అనే అర్థాలు వస్తాయి. క్రొత్తనిబంధనలో పశ్చాత్తాపం అంటే మనస్సు మార్చుకోవడం మాత్రమే కాదు, పూర్తిగా దేవునివైపు తిరగడం, ఒకని జీవితం యొక్క మూల ఉద్దేశం, దిశలో సమూల మార్పు. పశ్చాత్తాపం అంటే పాపాన్ని ఒప్పుకోవడమే కాదు, పాపాన్ని విడిచిపెట్టడం కూడా. దావీదు పశ్చాత్తాపపడ్డాడు. తిరిగి సమకూర్చబడ్డాడు. తప్పిపోయిన కుమారుడు పశ్చాత్తాపపడ్డాడు. పునరుద్ధరించబడ్డాడు. విరిగిన మనస్సు ఆయనకిష్టమైన బలి. విరిగి నలిగిన హృదయమును ఆయన అలక్ష్యము చేయడు (కీర్తన 51:17). అహాబు పశ్చాత్తాపపడ్డాడు. ఆయన సమయంలో రావలసిన శిక్ష వాయిదా పడింది. హిజ్కియా పశ్చాత్తాపపడ్డాడు. ఆయన సమయంలో రావలసిన శిక్ష వాయిదా పడింది.

విశ్వాసులు కూడా మారుమనస్సు పొందాలని రాయబడింది. రోమీయులకు రాసిన పత్రికలో మనస్సు మారి రూపాంతరం చెందాలి అని రాయబడింది. ప్రకటన గ్రంథంలో ఎఫెసీయుల సంఘానికి మారుమనస్సు పొందమని యోహాను ఉత్తరం రాసాడు.

విశ్వాసులు శరీరానుసారులుగా, లోకానుసారులుగా ఉండే ప్రమాదం ఉంది. మనం ఆత్మానుసారులముగా, పరలోక విషయాలను వెంబడించేవారంగా ఉండాలి. శరీరానుసారులుగా ఉంటే మనకు శరీరకార్యాలు ఉంటాయి. లోకానుసారులుగా ఉంటే యూదా లాగా శరీరాశ, నేత్రాశ జీవపుడంబం ఉంటాయి.

పశ్చాత్తాపంలో పాపాన్ని అసహ్యించుకొని, మనస్సులో నొచ్చుకొని, గ్రుచ్చుకొనబడి, విడిచిపెట్టడం జరుగుతుంది. పాపం విడిచిపెట్టడానికి మానవశక్తి సరిపోదు. దేవుని శక్తి మనలో పనిచేయాలి. పరిశుద్ధాత్ముడు పాపాన్ని గూర్చి, నీతిని గూర్చి, తీర్పును గూర్చి ఒప్పింపచేస్తాడు. పశ్చాత్తాపంలో పేతురువలె దైవచిత్తానుసారమైన దు:ఖం ఉంటుంది, చెడుతనాన్ని విడిచిపెట్టాలనే దృఢమైన సంకల్పం ఉంటుంది. తప్పుని సరిదిద్దుకొని సరియైన జీవితం జీవించడానికి తీర్మానం ఉంటుంది. అతిక్రమమును దాచిపెట్టువాడు వర్ధిల్లడు, దానిని ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరం పొందును అనే విషయం పశ్చాత్తాపానికి కొలమానంగా ఉంటుంది.

మనం స్వచ్ఛమైన మనస్సుతో, పవిత్రమైన ఉద్దేశాలతో, దుర్లాభాపేక్ష లేకుండా యేసుని వెంబడిస్తున్నామా అనేది ఒక ప్రశ్న. ఈ లోక విషయాలకు, లోకాశల కోసం మనం యేసుని వెంబడిస్తున్నామా అనేది ఆలోచించాల్సిన విషయం.

అన్యజనులతో సహవాసం, సువార్త ప్రకటించేటప్పుడు (కొర్నేలీ) పేతురు మారుమనస్సు పొందాల్సి వచ్చింది. యేసు పునరుత్థానుడైన తరువాత కూడా వెనుతిరిగిన పేతురు యేసు ప్రమేయంతో తిరిగి సమకూర్చబడ్డాడు. ఈ పశ్చాత్తాపమే అతని జీవితానికి ఒక టర్నింగ్‌పాయింట్ అయ్యింది. యేసు విషయంలో తన అభిప్రాయాన్ని మార్చుకోకుండా, పశ్చాత్తాపపడకుండా తన గమ్యాన్ని ఇస్కరియోతు యూదా ఎంచుకొన్నాడు (అ.కా. 1:25). అపోస్తలత్వాన్ని పోగొట్టుకొన్నాడు. యూదా యేసు వాడు కాదు.

యోహాను బోధ, యేసు బోధ, పౌలు బోధలలో, పేతురు సువార్తలో పశ్చాత్తాపం గూర్చిన అంశం కన్పిస్తుంది. మనం కూడా ప్రకటించేటప్పుడు యేసుని రక్షకునిగా అంగీకరించడంతోబాటు, పశ్చాత్తాపం చెందమని కూడా ప్రకటించాలి. అప్పుడే సువార్త విన్నవారిని తిరిగి జన్మించిన అనుభవంలోకి తీసుకెళ్ళగలం.

– జి జెర్మియా ప్రసాద్, స్టాఫ్, తుని



# అవకాశాల్ని జారవిడుచుకోవద్దు

అవకాశాలు వచ్చినప్పుడు అందిపుచ్చుకోవాలి లేకపోతే అవి పక్షిలా ఎగిరిపోతాయి. ఆ తరువాత ఎంత బాధపడినా ఉపయోగం ఉండదు. కొందరు 'సరైన అవకాశం కొరకు ఎదురుచూస్తున్నామండి' అంటారు. మరి కొందరు 'దేవుడిచ్చిన ఎన్నో అవకాశాల్ని సద్వినియోగం చేసుకోలేకపోయామండి' అని కుమిలిపోతారు. మన నిత్య జీవితంలో ఎన్నో అవకాశాలు వస్తాయి. అయితే వాటిని సద్వినియోగం చేసుకొంటున్నామా? లేక జారవిడుచుకొంటున్నామా? ఇయు విద్యార్థులుగా, వచ్చిన అవకాశాల్ని జారవిడుచుకోకుండా సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించడానికే ఈ ఆర్టికల్.

## అవకాశం అంటే ఏమిటి?

అవకాశం అంటే చేయడానికి అందివచ్చిన పని. అవకాశం అంటే అనుకూలమైన ఒక సందర్భం. దేవుని బిడ్డలమైన మనకు దేవుడు ఎన్నో అవకాశాలు ఇస్తాడు. ఆది 1:26 ప్రకారం దేవుడు - మన స్వరూపమందు మన పోలిక చొప్పున నరులను చేయుదము, వారు సముద్రపు చేపలను ఆకాశపక్షులను పశువులను సమస్త భూమిని భూమి మీద ప్రాకు ప్రతి జంతువును ఏలుదురు గాకనియు పలికెను. దేవుడు మానవులను సృష్టించింది దేవునితో సహవాసం చేస్తూ దేవుడిచ్చిన అవకాశాల్ని సరైన విధానంలో సద్వినియోగం చేసుకోవాలని. ఆది. 2:15 ప్రకారం దేవుడు మానవులకి భూమిని సేద్యపరచడానికి, సృష్టిమీద మేనేజర్స్‌గా ఉండే అవకాశాన్ని ఇచ్చాడు.

## అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవడం

బైబిల్‌లో (మత్తయి 25:14-30) తలాంతుల ఉపమానాన్ని గమనిస్తే యజమానుడు దూరదేశం వెళుతూ తన దాసుల్ని పిలిచి వ్యాపారం చేయమని ఒక వ్యక్తికి 5 తలాంతులు, రెండవ వ్యక్తికి 2 తలాంతులు, మూడవ వ్యక్తికి ఒక తలాంతును ఇస్తాడు. చాలాకాలం తరువాత దూరదేశము నుండి తిరిగి వచ్చిన యజమానుడు తన దాసుల్ని పిలిచి అడిగినప్పుడు 5 తలాంతులు తీసుకున్నవాడు మరొక 5 తలాంతుల్ని సంపాదించానని, అలాగే

రెండు తలాంతుల తీసుకొన్నవాడు ఇచ్చిన రెంటికి మరొక రెండు సంపాదించానని చెబుతాడు. వీరిద్దర్ని యజమానుడు 'భళా నమ్మకమైన మంచి దాసుడా' అని మెచ్చుకొని అనేకమైన వాటి మీద వారిని నియమిస్తాడు. ఒక్క తలాంతు తీసుకొన్న వ్యక్తి వ్యాపారం చేయకుండా దానిని భూమిలో పాతిపెడతాడు. అందుకు అతని యజమానుడు వానిని చూచి 'సోమరివైన చెడ్డదాసుడా' అని అతనిని శిక్షించడం మనం చూస్తాం.

యజమానుడు తన దాసులకి అవకాశం ఇచ్చినట్లు దేవుడు కూడా మనకు అవకాశాన్ని ఇస్తాడు. ఒక తలాంతును తీసుకొన్న వ్యక్తి వ్యాపారం చేసి అభివృద్ధి చేయడానికి బదులు దానిని గుంట తీసి పాతిపెట్టాడు. తనకు వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకొని శిక్షకు గురయ్యాడు.

## విద్యార్థుల జీవితంలో...

విద్యార్థులు ప్రాముఖ్యంగా రెండు విషయాలలో అవకాశాల్ని జారవిడుచుకొంటారు. అవి 1. పరిచర్య, 2. కెరీర్

### పరిచర్య

పరిచర్య అనగానే విద్యార్థులుగా మేమేమి పరిచర్య చేస్తాం, పరిచర్య చేసేది గ్రాడ్యుయేట్స్, స్టాఫ్, పాస్టర్స్ మరియు ప్రత్యేకించబడిన కొంతమంది సేవకులు గదా! అనే ఆలోచన రాకపోదు. యేసయ్య తన శిష్యులతో మాట్లాడుతూ మీరు సర్వసృష్టికి వెళ్ళి సర్వజనులకు సువార్తను ప్రకటించి వారిని నా శిష్యులు గా తయారుచేయండి అని ఆజ్ఞాపించాడు. ప్రస్తుతం మీరు సర్వసృష్టికి వెళ్ళకపోయినా కళాశాలలో చదువుకునే అవకాశాన్ని దేవుడు మీకిచ్చాడు. ఈ సర్వజనులలో కళాశాల విద్యార్థులు కూడా ఉన్నారు. ఈ కళాశాలలోని విద్యార్థులు నిజదేవునిని తెలుసుకొని సొంత రక్షకునిగా అంగీకరించకపోతే వారు నరకానికి వెళతారు. కొన్ని సంవత్సరాల క్రితం ప్రొ. ఇనోక్ గారికి ఇలాంటి ఆలోచనే వచ్చింది. తన హృదయం భారంతో నిండింది. అలాంటి భారం కలిగిన కొంతమంది సహోదరులతో కలిసి ప్రార్థించి, దేవుడిచ్చిన దర్శనాన్ని బట్టి కళాశాలలోని విద్యార్థుల మధ్య పరిచర్య ప్రారంభించారు.

ఈ పరిచర్యలోనే ఇప్పుడు నీవు నేను ఉన్నాము. ఇప్పుడు ఈ పరిచర్య 'యుఇయస్ఐ' దేశమంతా శాఖోపశాఖలుగా విస్తరించింది. ఎంతోమంది గ్రాడ్యుయేట్స్, విద్యార్థులు దేవుడు వారికిచ్చిన అవకాశాల్ని ఉపయోగించుకొని ఎంతోమంది విద్యార్థులకు సువార్తను ప్రకటించి వారి జీవితాల్ని మార్చగలిగారు. ఎంతోమంది గ్రాడ్యుయేట్స్ ఇది మనకు దేవుడిచ్చిన పరిచర్య అని నమ్మి విద్యార్థుల కొరకు వారి గృహాలను ఓపెన్ హోమ్స్‌గా తెరిచారు. వారి సమయాన్ని, ధనాన్ని, కంఫర్ట్‌ని త్యాగం చేసి పరిచర్యలో కొనసాగుతున్నారు. ఈ ఆర్టికల్ నీవు చదువుతున్నప్పుడు, నిన్ను క్రీస్తులోకి, రక్షణలోకి నడిపించిన అన్న, అక్క నీకు కనిపిస్తున్నారు కదూ. వారు నీ ఆత్మీయ ఎదుగుదలకు తీసుకున్న శ్రద్ధ ఎంతో విలువైనది కదూ! ప్రియ తమ్ముడు, చెల్లి ఒక్కసారి ఆలోచించు, నీవు కళాశాలలో (బి.టెక్/డిగ్రీ/పిజి/మెడిసిన్) చేరి ఎంతకాలం అవుతుంది? దేవుడు నీకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నావా? లేదా వచ్చిన అవకాశాల్ని జారవిడుచుకుంటున్నావా?

## పరిచర్యలో ఎలాంటి అవకాశాలు వస్తాయి?

నీ రూమ్‌ని, హాస్టల్‌ని ఓపెన్‌గా ఉంచి విద్యార్థుల్ని ఇబియస్ కొరకు ఆహ్వానించవచ్చు. సీనియర్ స్టూడెంట్‌గా బైబిల్‌స్టడీ తీసుకోవచ్చు. దేవుడిచ్చిన అవకాశాన్ని బట్టి వ్యక్తిగత సువార్త చెప్పవచ్చు. కొత్తగా వస్తున్న స్టూడెంట్స్‌కి సబ్జెక్ట్ పరంగా ఏమైనా డౌట్స్ ఉంటే వాటిని క్లారిఫై చేయవచ్చు. మైక్రోప్రేయర్ సెల్స్‌లో సీనియర్ స్టూడెంట్స్‌గా కొత్తగా రక్షణలోకి వచ్చిన విద్యార్థుల్ని ప్రోత్సహించవచ్చు. విద్యార్థుల్ని గ్రాడ్యుయేట్స్ అన్న/అక్క వాళ్ళ ఇంటికి ఆహ్వానించవచ్చు. మీటింగ్స్‌ని నడిపించే అవకాశం, పాటలు పాడే అవకాశాల్ని ఉపయోగించుకోవచ్చు. గాస్పల్ మీటింగ్స్ గాని, గాస్పల్ రిట్రీట్స్, ఇ-క్యాంప్స్ జరిగినప్పుడు విద్యార్థుల్ని వాటికి ఆహ్వానించవచ్చు. అయితే ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. బాయ్స్, బాయ్స్‌ని అదే విధంగా గార్ల్స్, గార్ల్స్‌ని ఆహ్వానించడం మంచిది. ఎందుకంటే అపోజిట్ సెక్స్ విషయంలో ఎంత జాగ్రత్తగా ఉంటే అంత మంచిది. చూశారు కదా కళాశాలలో ఎన్ని అవకాశాలు మనకు ఉన్నాయో. ఈ అవకాశాల్ని మనం జారవిడుచుకోకూడదు.

కొన్నిసార్లు గ్రాడ్యుయేట్స్ అన్నవాళ్ళు మనల్ని తమ్ముడు ఈ సంవత్సరం కమిటీలో ఉంటావా? బైబిల్ స్టడీ తీసుకుంటావా? లేదా ఈ ప్రాక్టికల్ టాక్ తీసుకో అని అడిగినప్పుడు ప్రార్థనాపూర్వకంగా దేవుడిచ్చిన అవకాశాల్ని ఉపయోగించుకోవాలి. ప్రియ తమ్ముడు, చెల్లి దేవుడిచ్చిన ఇన్ని అవకాశాల్ని సద్వినియోగం చేసుకొంటున్నావా? లేదా జారవిడుచుకుంటున్నావా? ఒక్కసారి ఆలోచించుకోమని మిమ్మల్ని దేవుని పేరట వేడుకొనుచున్నాను.

### కెరీర్

చాలాసార్లు కెరీర్‌లో వచ్చే అవకాశాల్ని కూడా జారవిడుచుకొని ఆ తరువాత బాధపడే వారు చాలామంది ఉన్నారు. ఏ విద్యార్థి కోరికైనా కెరీర్‌లో విజయం సాధిస్తూ, స్టడీస్‌లో ఎక్సెల్ అవ్వాలని. మీరు ఉద్యోగస్థుల కుటుంబం నుండి వచ్చినా లేదా వ్యవసాయ కుటుంబం నుండి వచ్చినా మీ తల్లిదండ్రులకు మీ మీద ఉండే ఒకే ఒక్క ఆశ మా బిడ్డలు భవిష్యత్తులో బాగుండాలని, మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని, వారికాళ్ళ మీద వారు నిలబడాలని కోరుకొంటారు. కొంతమంది తల్లిదండ్రులు ఎండకు ఎండి, వానలో తడిచి, ఎంతో కష్టపడి వారి ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా, వారి సుఖాలను పక్కనపెట్టి, పైసా పైసా కూడబెట్టి నీకు డబ్బులు పంపిస్తున్నారు. నిన్ను చదివిస్తున్నారు. నీ గురించి వారికి ఎన్నో కలలు ఉన్నాయి. వారి ఆలోచనలు అన్నీ నీ కొరకే. ఒకవిధంగా చెప్పాలంటే నా కుమారుడు/కుమార్తె బాగుండాలని ఎంతగానో తపిస్తున్నారు. "పిల్లల యొక్క సంతోషం తల్లిదండ్రుల మీద ఆధారపడి ఉంటే, తల్లిదండ్రుల యొక్క కీర్తి ప్రతిష్టలు పిల్లల మీద ఆధారపడి ఉంటాయి". కాబట్టి మీ కెరీర్ గురించి మీరెంత సీరియస్‌గా తీసుకొంటున్నారు? భూలోక సంబంధమైన తల్లిదండ్రులకే మీ మీద, మీ కెరీర్ మీద ఇంత ఆశ ఉంటే మరి మనల్ని సృష్టించిన సృష్టికర్త, జీవాధిపతి మనందరి పాపాలు నిమిత్తం కల్వరి సిలువలో ప్రాణం పెట్టిన ఆ పరలోక తండ్రికి ఇంకెంత ఆలోచన ఉందో ఒక్కసారి ఆలోచించండి. అందుకే దేవుడు యిర్మీయా 1:4-5లో గర్భములో నేను నిన్ను రూపింపకమునుపే నిన్నెరిగితిని, నా అరచేతుల మీదనే నిన్ను చెక్కియున్నాను అంటున్నాడు (యెషయా 49:16). దీనిని బట్టి మన పట్ల, మన కెరీర్ పట్ల ఎక్కువ శ్రద్ధ కలిగి ఉన్నాడు.

### కెరీర్‌లో ఎలాంటి అవకాశాలు వస్తాయి?

విద్యార్థులుగా స్టడీస్‌లో మంచి మార్కులు తెచ్చుకొనే అవకాశం. మన స్టడీస్ ద్వారా మనం దేవుని పిల్లలం అని నిరూపించుకొనే అవకాశం. హాస్టల్స్, రూమ్స్‌లో, కళాశాలల్లో క్రమశిక్షణతో ఉండి ఇతరులకి మాదిరి చూపించే అవకాశం. కొన్నిసార్లు కళాశాల యాన్యువల్ డే లేక వెల్‌కమ్ లేక ఫేర్‌వెల్ ఫంక్షన్స్‌లో మాట్లాడే అవకాశం వస్తుంది. మీకు ఏదైనా ఒక సబ్జెక్ట్ మీద మంచి పట్టు ఉన్నప్పుడు, ఇతరులకి చెప్పే అవకాశం కలుగుతుంది. సందర్భాన్ని బట్టి వ్యాస రచనల పోటీలు లేక డిబేటింగ్ లేదా క్విజ్ కాంపిటేషన్స్‌లో పాల్గొనే అవకాశం వస్తుంది. క్యాంపస్ ఇంటర్వ్యూస్ ద్వారా ఉద్యోగాలు పొందే అవకాశం వస్తుంది. కొన్నిసార్లు ఎన్.సి.సి., ఎన్.యస్.యస్‌ల ద్వారా సమాజసేవ చేసే అవకాశం వస్తుంది. కొన్నిసార్లు మీకు స్పోర్ట్స్, గేమ్స్ మీద ఆసక్తి ఉంటే వాటిలో ఎన్నో మెడల్స్ గెల్చుకొనే అవకాశం వస్తుంది.

గాంధీవర్మ అనే మన ఇయు స్టూడెంట్ శ్రీకాకుళం గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో బి.ఎ. తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. తమ్ముడు స్విమ్మింగ్‌లో స్టేట్ లెవల్ గోల్డ్ మెడల్, నేషనల్ లెవల్‌లో బ్రాంజ్ మెడల్స్‌ని గెల్చుకున్నాడు. దీనిని పురస్కరించుకొని శ్రీకాకుళంలో యంపి, యం.ఎల్.ఎ, కలెక్టర్, ప్రిన్సిపాల్ వీరందరు తమ్ముడిని ఘనంగా సన్మానించారు. తమ్ముడు ఈ విషయాన్ని నాతో షేర్ చేసుకున్నప్పుడు నేనెంతగానో సంతోషించి దేవుడిని ఘనపరచాను. ప్రసంగి 9:10 ప్రకారం చేయుటకు నీ చేతికి వచ్చిన యే పనైనను నీ శక్తి లోపము లేకుండా చేయుము. కాబట్టి కెరీర్ పరంగా దేవుడిచ్చిన అవకాశాల్ని సద్వినియోగం చేసుకుంటున్నామా? లేక జారవిడుచుకొంటున్నామా?

### అవకాశాల్ని జారవిడుచుకోవడానికి కారణాలు

1. పరిచర్య పట్ల, కెరీర్ పట్ల సరైన అవగాహన లేకపోవడం
2. వచ్చిన అవకాశాల్ని తేలికగా తీసుకోవడం, త్రోసిపుచ్చడం, మరోసారి వస్తాయిలే అనే తత్వం
3. మన గురించి మనం తక్కువగా అంచనా

వేసుకోవడం, గత వైఫల్యాల్ని తలంచుకొంటూ బాధపడడం

4. విశ్వాసంలో దేవుని శక్తి మీద ఆధార పడకపోవడం
5. నేర్చుకోవలసిన వాటిని నేర్చుకోలేకపోవడం
6. ఏదైనా ఒక బైబిల్ స్టడీ తీసుకోవాలన్నా, ఫస్ట్ క్లాస్/డిస్టింక్షన్‌లో పాస్ అవ్వాలన్నా కష్టపడాలి. కష్టపడడానికి ఇష్టంలేకపోవడం. సోమరిగా జీవించడం
7. దేవుడు మనకిచ్చిన వరాల్ని గుర్తించకపోవడం. కనీసం మన గ్రాడ్యుయేట్ అన్నవాళ్లని/ అక్కవాళ్ళని అడిగి తెలుసుకోకపోవడం
8. సరైన దర్శనం లేకపోవడం
9. మనం సాధించిన విజయాల్ని ఇతరులతో పంచుకోకపోవడం
10. మనం కంఫర్ట్ జోన్ విడిచిపెట్టి రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడకపోవడం

## ముగింపు

ప్రియ తమ్ముడు, చెల్లీ ఇదంతా చదివిన తరువాత నీ అవగాహన ఏమిటి? ఇప్పుడు దేవుడు నీ కళ్ళ ముందు ఎన్నో అవకాశాల్ని ఉంచాడు. పరిచర్యలోను, కెరీర్‌లోను దేవుడిచ్చిన అవకాశాల్ని జారవిడుచుకోకుండా ప్రభువుతో భళా నమ్మకమైన మంచి దాసుడా అని అనిపించుకుందామా లేక సోమరివైన చెడ్డదాసుడా అని అనిపించుకుందామా? నిర్ణయం మనదే. ఇప్పుడు నీవు తీసుకున్న నిర్ణయం నీ జీవితాన్ని మార్చే ఒక టర్నింగ్ పాయింట్‌కావచ్చు. ఒకవేళ ఇప్పటి వరకు మనం రకరకాల కారణాలతో దేవుడిచ్చిన అవకాశాల్ని జారవిడుచుకొంటే ప్రభువు దగ్గర క్షమాపణ అడుగుదాం. కీర్తన 143:10 ప్రకారం దావీదు అన్నట్లు నీవే నా దేవుడవు నీ చిత్తానుసారముగా ప్రవర్తించుట నాకు నేర్పుము అని కోరుతూ దేవుడిచ్చిన అవకాశాల్ని జారవిడుచుకోకుండా ప్రభువు చిత్తాన్ని మన జీవితంలో నెరవేరుద్దాం.

**– డా. యం. సాల్మన్‌రాజు,** వైజాగ్

# Crossword Puzzle

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | 3 | | 4 |
| | ■ | | 5 | | | | |
| | ■ | | ■ | ■ | | ■ | |
| 6 | | | | | | | |
| 7 | | | | | | ■ | |
| ■ | 8 | | | | | | |
| 9 | | | | | | | |




*Please find out the hidden words in the puzzle using the clues/hints and send to Nambur office within 15 days.*

**Horizontal**

1. A brahmin lady called Pandit who left all and followed Jesus
5. Second daughter of Catherine & William she began to speak in public at 19 yrs age
6. A Scotland's Schindler, missionary to Budapest, where she was arrested by the Nazis
7. She stood as a mark of forgivenss, who lost her husband and two sons in India(1999)
8. First missionary women to serve in China who founded a school for girls in Zhejiang
9. She was a missionary to Nigeria, who adopted many African children

**Vertical**

1. She was born in Qingiang, China her parents are medical missionaries
2. Pioneer missionary & educator for 12 yrs in china, died at 33 yrs age
3. She inspired many, especially Jim Elliot& Elisabeth to be missionary.
4. She is the mother of Methodism, born in 1669, who is an example of praying mother

## Last month key:

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| J | A | R | E | D | ■ | N |
| ■ | G | ■ | J | ■ | ■ | A |
| ■ | A | H | E | L | E | B |
| A | G | R | I | P | P | A |
| H | ■ | ■ | E | ■ | H | L |
| A | ■ | A | L | V | A | H |
| M | A | L | A | C | H | I |

1. *M. Ankarao, Guntur*
2. *T. Anand Babu & Koteswari, Chilakaluripet*
3. *R. Suma Srinivas, Staff, Tirupathi*
4. *B. Rupla, Nandigama*
5. *R. Karun Kumar, Tuni*
6. *T. Annamani, Gudiwada*
7. *Mangarao Jonnakuti, Jangareddigudem*

సాక్ష్యం



# నా జీవితంలో టర్నింగ్ పాయింట్

ప్రతి ఒక్కరి జీవితంలో మంచికైనా, చెడుకైనా కొన్ని టర్నింగ్ పాయింట్స్ ఉంటాయి. నా జీవితంలో ఒక గొప్ప టర్నింగ్ పాయింట్‌ను మీతో పంచుకోవాలని ఇష్టపడుతున్నాను.

క్రైస్తవ కుటుంబంలో జన్మించిన నేను ఒక ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుకొనే రోజుల్లోనే దారి తప్పాను. స్నేహితులతో కలిసి ఈ లోకంలో ఎంజాయ్ చేశాను. ఇంట్లో స్కూల్‌కని చెప్పి స్నేహితులతో తిరగడం, చదవాల్సిన సమయంలో చదవకుండా సినిమాలు చూడడం, అసహ్యమైన మాటలతో దూషించడం, అనేక చెడు తలంపులతో నా జీవితం నిండిపోయింది. పదవ తరగతిలో అత్తెసరు మార్కులతో పాసయ్యాను. ఇక ఇంటర్మీడియట్‌కి కాలేజ్‌లో చేరిన తర్వాత నా స్వేచ్ఛకు అడ్డులేకుండా పోయింది. పదో తరగతిలో జీవించినట్లే ఇంటర్‌లో కూడా జీవించాను. ఏపీఆర్‌డిసి సెట్ రాసి గుంటూరు జిల్లాలోని నాగార్జునసాగర్ లో సీటు సంపాదించాను. తల్లిదండ్రులకు దూరంగా హాస్టల్లో ఉంటున్న నాకు పాపం చేయకుండడానికి అడ్డు చెప్పేవారు ఎవరూ లేరు. అలా జీవిస్తున్న సమయంలో నా జీవితం ఒక మలుపుకు గురయ్యింది.

ఒకరోజు నాకు తెలిసిన సీనియర్ అన్న మహేష్ నా దగ్గరకు వచ్చి 'తమ్ముడు ఈరోజు బైబిల్ స్టడీ ఉంది అని చెప్పి నువ్వు తప్పకుండా రావాలి' అన్నాడు. ఇక అన్నమాట తీసివేయలేక చాలా కష్టంగా బైబిల్‌స్టడీకి వెళ్లాను. ఆ రోజు సాయంత్రం జీవితంలో ఎప్పటికీ మర్చిపోనిది. గ్రాడ్యుయేట్ కుమార్ అన్న బైబిల్ స్టడీ తీసుకొన్నాడు. బైబిల్‌లో ఉన్న వాక్యాన్ని డిస్కస్ చేస్తున్నప్పుడు నేను చేసిన చెడ్డ పనులన్నీ ఎత్తు చూపుతున్నట్లు అనిపించింది. చెడు జీవితానికి వచ్చే ఫలితాలను కూడా తెలుసుకొన్నాను. ఒక్కసారిగా చాలా బాధ అనిపించింది. బైబిల్ స్టడీ అయిపోయిన తర్వాత హాస్టల్‌కి వెళ్ళాను. ఆ రాత్రి సరిగ్గా నిద్ర పోలేదు. దేవుని దగ్గర నా పాపాలన్నీ ఒప్పుకోవాలని అనిపించి అందరూ నిద్రపోయిన తర్వాత మోకరించి నేను చేసిన తప్పులు, పాపాలు ఒప్పుకోవడం ప్రారంభించాను. గతంలో అన్నీ చేస్తూ నామకార్థంగా ప్రార్థించే నేను హృదయపూర్వకంగా దేవునితో మాట్లాడటం ప్రారంభించాను. నా పాపాలు ఒప్పుకున్నప్పటి నుంచి మనసులో తెలియని ఆనందాన్ని అనుభవించాను.

ఒకరోజు మహేష్ అన్న, మరొకరు మెస్‌హాల్లో క్వైట్‌టైమ్ గురించి మాట్లాడుకొంటున్నారు. నాకేమీ అర్థం కాక క్వైట్‌టైమ్ అంటే ఏంటన్న అని అడిగాను. అన్న అర్థమయ్యేలా వివరించాడు. అప్పటి నుంచి రోజూ కొంత సమయం దేవునితో గడపడం మొదలు పెట్టాను. కొన్ని రోజులు గడిచిన తర్వాత కాలేజ్‌కి మూడు రోజులు సెలవులు వచ్చాయి. మహేష్ అన్న నన్ను ఇ-క్యాంప్‌కి తీసుకెళ్లారు. అక్కడ ప్రభువు నాతో స్పష్టంగా మాట్లాడాడు. నేను ఒంటరి వాడిని కానని నాకోసం యేసుక్రీస్తు ప్రభువు తన ప్రాణాన్ని వెలగా చెల్లించాడని అర్థమై, ఆయనను స్వంత రక్షకునిగా అంగీకరించి ఇక ఆయన కోసం జీవించాలని నిర్ణయం తీసుకొన్నాను. ఇంతకుముందు సినిమాలు చూస్తూ నా సమయాన్ని వృధా చేసుకొనే వాడిని, అసహ్యంగా మాట్లాడే వాడిని. వాటన్నిటినీ దేవుని సహాయంతో విడిచిపెట్టి దేవుని దగ్గర అనుదినం పరిశుద్ధ పరచుకొంటూ దేవుడి కోసం సాక్షిగా నిలస్తూ వ్యక్తిగత సువార్త చేయడం, చదువులో రాణిస్తూ, సహవాసంలో సంతోషాన్ని అనుభవిస్తున్నాను. నేను పాపినని గ్రహించి, నా పాపాలు ఒప్పుకొని, యేసుక్రీస్తును స్వంత రక్షకునిగా అంగీకరించడమే నా జీవితానికి ఒక గొప్ప టర్నింగ్ పాయింట్ అయ్యింది. ప్రస్తుతం నేను తాడేపల్లిగూడెంలో యంబిఏ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను.

**– కె. యేసురత్న కుమార్,** తాడేపల్లిగూడెం
ఇయు విద్యార్థి

స్వపరీక్ష

# మన పరిచర్య

వ్యక్తిగతంగా, సహవాసంగా
పరీక్షించుకుందాం



*"ఎవడైనను ఈ పునాదిమీద బంగారము, వెండి, వెలగల రాళ్లు, కఱ్ఱ, గడ్డి, కొయ్యకాలు మొదలైనవాటితో కట్టినయెడల, వాని వాని పని కనబడును, ఆ దినము దానిని తేటపరచును, అది అగ్నిచేత బయలు పరచబడును. మరియు వాని వాని పని యెట్టిదో దానిని అగ్నియే పరీక్షించును.*

*నాటువాడును నీళ్లుపోయువాడును ఒక్కటే. ప్రతి వాడు తాను చేసిన కష్టముకొలది జీతము పుచ్చుకొనును".*

*– 1 కొరింథీ 3:12,13; 3:8*

ఒకసారి అడవిలో ఒక చీమ ఏనుగు చెవి మీద కూర్చొని ప్రయాణం చేస్తూవుంది. అవి వెళ్ళే దారిలో ఒక నీటివాగు ప్రవహిస్తూవుంది. అప్పుడు ఆ ఏనుగు దాని మీదున్న చెక్కవంతెన మీదుగా వాగును దాటుతున్నప్పుడు ఆ వంతెన షేక్ అవుతుంది. అప్పుడు ఆ చీమ ఏనుగు చెవిలో 'నీవు, నేను కలిసి ఈ వంతెనను షేక్ చేశాం' అని గుసగుసలాడుతుంది. మనం కూడా ఏనుగు చెవి మీద కూర్చొనే చీమలాంటివారమే. పని దేవునిది, పని జరిగించేది ఆయనే. మనము ఆయన చేతిలో పాత్రలం. పరిచర్యలో ఈ గ్రహింపు మనకు ఎల్లప్పుడూ ఉండాలి.

## పరిచర్య అంటే?


పరిచర్య అంటే దేవుడు మనకప్పగించిన పని, మనం నిర్వర్తించాల్సిన బాధ్యత. దేవుని పరిచర్యను నిబద్ధత, చిత్తశుద్ధి, నమ్మకం, సమర్పణతో వెంబడించిన దైవభక్తుల జీవిత అనుభవాలు, యేసుక్రీస్తు, పౌలు వంటి ఆదర్శవంతమైన జీవితాలు దేవుని సేవంటే ఏమిటో చక్కగా వివరించాయి. పరిచర్య గొప్ప ఆధిక్యత, ఎంతో ప్రశస్తమైనది, బరువైనది, భారమైనది, క్లిష్టమైనది కూడా. దేవుని మనస్సు, ఉద్దేశం, దర్శనం అర్థం చేసుకొని ఆయన పిలుపుకు లోబడి (మత్తయి 28:20) సంతోషంగా, ఉత్సాహంగా, లక్ష్యసాధన దిశగా పరిచర్యను చేయడంలో, కొనసాగించడంలో కొన్ని సవాళ్ళను, సమస్యలను, ఇబ్బందులను ఎదుర్కొనాల్సి వస్తుందని వారి జీవితాలు చూపించాయి.

## పరిచర్య ఏదికాదు?

అయితే ప్రస్తుత కాలంలో నవతరం బోధకులు, బోధిస్తున్న బోధలు క్రైస్తవ జీవితం అంటే అన్నింటిలో అభివృద్ధి, కావల్సినంత సంపద, సంపూర్ణ ఆరోగ్యం, పరిచర్య అంటే రెడ్ కార్పెట్ ఆహ్వానం, సమస్యలు ఫ్రీ అని వర్ణించే చిత్రాలు కాదు.

## యేసుక్రీస్తు పరిచర్య

తండ్రి చిత్తం చేయడమే జీవిత పరమావధిగా పెట్టుకున్న యేసుప్రభువు మూడున్నర సంవత్సరాల



సేవా ప్రయాణం సాఫీగా జరగలేదు. ఏదో రూపంలో అడుగడుగునా ఆటంకాలు, సవాళ్ళు, వ్యతిరేకతలు, విమర్శలు, అవమానాలు, దుర్భాషలు, అపార్థాలు, చంపాలనే ప్రయత్నాలతోనే ఆయన పరిచర్య జీవితం అంతం వరకు కొనసాగింది. అయినప్పటికీ, ఆయన చలించిపోవడం, కృంగిపోవడం, నిరాశకు లోనవడం ప్రతిచర్యలు చూపడం వంటివి ఏ కోశానా ఆయన జీవితంలో చూడం. ఆయనెవరో, ఎక్కడ నుంచి వచ్చాడో, వచ్చిన ఉద్దేశ్యమేంటో, అంతిమంగా ఎక్కడికి వెళతారో ఆయనకు తెలుసు. తండ్రి తన చేతికి సమస్తమును అప్పగించెననియు, తాను దేవుని యొద్ద నుండి బయలుదేరి వచ్చెననియు దేవునివద్దకు వెళ్ళవలసియున్నదని యెరిగాడు (యోహాను 13:3). ఇదే ఆయనకు స్ఫూర్తి, పురికొల్పు. అందుకే మనం ఆయనను వెంబడించి ఆయనలా జీవించాలి. ఆయనలా సేవ చేయాలంటే ప్రాణాన్ని కూడా లెక్కచేయనంతగా సిద్ధపడాలని ఖచ్చితంగా చెప్పాడే గాని జీవితాన్ని పూలపాన్పులా మార్చుకోమని సలహా ఇవ్వలేదు. దీనికి ఎవ్వరూ మినహాయింపు కాదు.

## యుఇయస్ఐ పరిచర్య

సహవాసానికి, స్వచ్ఛమైన ప్రేమకు, వ్యక్తిగత శ్రద్ధకు స్పష్టమైన దర్శనానికి మారుపేరుగా కొనసాగుతుంది యుఇయస్ఐ పరిచర్య. ఇది దేవుని అద్భుత ప్రణాళిక ప్రకారం ఆరంభించిన సంస్థ, సహవాసం, పెద్ద కుటుంబం. నశించిపోతున్న విద్యార్థుల పట్ల స్పష్టమైన దర్శనం, అభిలాష తీవ్రతతో, ముందుకు కొనసాగుతున్న మహోద్యమం. పరిచర్య చేయాలనుకునే వారికి ఇదొక సేవా కేంద్రం. సంస్థ నిర్మాణాలు, ప్రాజెక్ట్ల కంటే వ్యక్తుల జీవిత నిర్మాణమే అతిప్రాముఖ్యమని ఆదర్శవాదులుగా జీవించి, దైవభక్తి వారసత్వాన్ని వదిలివెళ్ళిన పూర్వీకుల హృదయస్పందన ఇది. విద్యార్థి దశ నుంచి ఆధ్యాత్మికంగా గ్రాడ్యుయేట్స్‌గా ఎదిగినవారు, గ్రాడ్యుయేట్స్‌గా పరిచర్యకు పరిచయమైనవారు, గ్రాడ్యుయేట్స్ స్టేజ్ నుండి స్టాఫ్‌గా కొనసాగేవారి బృందం ఇది.

ఏ నేపథ్యం నుంచి వచ్చినా పరిచర్యలో ఉత్సాహంగా, చురుకుగా, సమర్పణతో చేయాలనుకొనే అభిలాష కలిగిన వారి శాతం ఎక్కువే.

## పరిచర్యలో మన లక్ష్యాలు - ప్రణాళికలలో లేఖనాల పాత్ర

వ్యూహాత్మక ప్రణాళికలను రచించి, వాటిని ఆచరించిన అనేకమంది నాయకుల ఉదాహరణలతో బైబిల్ నిండి ఉంది.

**1. మోషే:** ఈయన వ్యూహాత్మక ఆలోచనకర్త అని మనం బైబిల్‌లో స్పష్టంగా చూడగలం. ఇశ్రాయేలీయులను ఈజిప్ట్ నుండి బయటికి తీసుకొచ్చిన తర్వాత నాయకునిగా ఇబ్బంది పడుతూ ఉంటే, పని భారాన్ని అందరికీ పంచే వ్యూహాత్మక ప్రణాళికను తన మామైన యిత్రో అందిస్తాడు.దాని ఫలితంగా పరిచర్యను ప్రభావవంతంగా సఫలీకృతం చేయగల మానవవనరులను మరింతగా వినియోగించుకోవడం జరిగింది. కనానుకు వేగుల వారిని పంపే విషయంలో కూడా మోషే వ్యూహాత్మకంగా ఆలోచించి పనిచేయడాన్ని మనం చూడగలం.

**2. యెహోషువ:** మోషే సంరక్షకునిగా ఉన్న యెహోషువ సైతం వ్యూహాత్మక నాయకత్వాన్ని ప్రదర్శించాడు. యెహోషువ ఇశ్రాయేలీయులను వాగ్దాన దేశంలోనికి నడిపిస్తున్న తరుణంలో, వారికి యెరికో పట్టణం మొట్టమొదటి శత్రువు రూపంలో ఎదురైంది. యెహోషువ 6వ అధ్యాయంలో, దేవుడు యెహోషువకు ఒక వ్యూహాన్ని ఇచ్చారు. దేవుడే పరలోకము నుండి దిగివచ్చి తన ప్రజలు కూడా పాల్గొనే వ్యూహాన్ని ఎంచుకోవడానికి దేవుడు ఇష్టపడ్డాడు.

**3. నెహెమ్యా:** దేవునిచే ఎన్నుకోబడి, వ్యూహాలను ఉపయోగించి యెరూషలేము గోడలను పున: నిర్మించాలనే భారాన్ని దేవుడు తన హృదయంలో పెట్టినప్పుడు, ఆ దైవదర్శనాన్ని నెరవేర్చడానికి

తమ ఆలోచనలకు పొందవలసిన పురికొల్పు పొందకపోవడం, ఆశించినరీతిలో పరిచర్యలో పాల్గొనే, బాధ్యతలు చేపట్టే అవకాశాలు రాకపోవడం, చేస్తున్న వ్యక్తిగత పరిచర్యను తప్పుపట్టడం, తమ భావాలను అపార్థం చేసుకోవడం వంటి పరిస్థితులు పరిచర్య తీవ్రతకు ఆనకట్ట వేస్తుంటాయి. అంతమాత్రాన, దేవుడు పిలిచిన పిలుపును పక్కనపెట్టి, సహవాసానికి దూరమయిపోయి, పరిచర్యను వదలిపెట్టడం పరిష్కారం కాదు. అలా అనుకొంటే మొదటి శతాబ్దంలో పౌలు ఒక్క సంఘాన్ని కూడా స్థాపించేవాడు కాదు.

అవసరమైన మంచి ప్రణాళికను రచించి, నష్టాన్ని అంచనా వేసి తనవద్ద ఉన్న వనరులను భద్రపరచి, తగిన నాయకులను ఏర్పరచి పనిని విభజించి అప్పగించారు.

**4. దావీదు:** చిన్ననాటి నుండి వ్యూహాత్మక ఆలోచనాపరుడు. దేవునిచే ఇవ్వబడిన వ్యూహంతో, శత్రువు యొక్క బలహీన స్థలాన్ని సూటిగా ఛేదించటం వలన గొల్యాతును ఓడించాడు. తరువాత వ్యూహాత్మక సమయోచిత ప్రణాళికలను రచించడానికి దావీదుకు కొంతమంది అవసరమవ్వడంతో దేవుడు ఆయనకు ఇశ్శాఖారీయులను ఇచ్చారు (1 దిన 12:32).

**5. పౌలు:** పౌలు చేసిన మిషనరీ ప్రయాణాలు, వ్యూహాలు, ముఖ్యమైన పట్టణాలలో పరిచర్యకు సంబంధించిన పెద్దలను నియమించడానికి ఆయన తీసుకున్న జాగ్రత్తలు తప్పనిసరిగా లెక్కలోనికి తీసుకోవలసిందే. అత్యధిక స్థాయిలో ప్రజలపై ప్రభావం చూపగల అతిపెద్ద పట్టణాల్లో పరిచర్య చేయడానికి ఆయన పూనుకున్నాడు.

## పరిచర్య లక్ష్యాలు సాధించుటలో పరిశుద్ధాత్మని పాత్ర

**1. దేవుని రాజ్యాన్ని మొదట వెదకాలి: (మత్తయి 6:33).**

ఎ. మనము దేవుని సార్వభౌమాధికారానికి అప్పగించుకోవాలి. మనం చేసే ప్రతి ప్రయత్నాలపై, అంశాలపై దేవుని ప్రభువని అంగీకరించి, ఆయన చిత్తాన్ని నెరవేర్చేదానికి నిర్ణయం తీసుకోవాలి.

బి. మన సొంత తీర్మానాలను ఆయనకు అప్పగించుకొని, ఇతరులతో "ఈ పని తప్పక జరగాలని ఆశిస్తూ, దేవునికి ఇచ్చివేస్తున్నాను" అని చెప్పగలగాలి.

సి. దేవుని మనోభిలాష పట్ల మనకు అత్యుత్తమ అభిరుచి ఉండాలి. విశ్వాసంలో ఎదుగుతున్న కొలది దేవుని మహిమను గూర్చి మరింతగా అభిలషిస్తూ, విశ్వమానవాళిచేత రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువు అని కొనియాడబడే విధంగా దేవుని రాజ్యాన్ని వెదకాలి.

**2. లేఖనాలలోని మంద్ర శృతిని వినాలి:** పరిచర్య ప్రయాస అంతటిలో లేఖనాలలోని మంద్ర శృతి ప్రతిధ్వనించాలి. తన సృష్టిలోని మానవాళిని ఆశీర్వదించాలి అన్నదే దేవుని ముఖ్యమైన కార్యం. ఇదే బైబిల్‌లో వినిపించే అతిలోతైన, మంద్రస్థాయి శృతికి ఒక ఉదాహరణ.

**3. గతంలో దేవుడు నడిపించిన మార్గాలను గౌరవించాలి:** పరిశుద్ధాత్మకు అవకాశం కల్పించే ప్రణాళికలలో గతంలో దేవుడు ఏమి చేశాడో అనే ప్రస్తావన తప్పక ఉంటుంది. మన పూర్వీకులను దేవుడు ఏవిధంగా నడిపించాడో ఆ మార్గాలను మనం గౌరవించాలి.

**4. మానవాతీత, పరిశుద్ధాత్మ, తలాంతులు సైతం అంగీకరించటం:** పరిశుద్ధాత్మను, ఆయన ఇచ్చే వరాలను మనం కేవలం ఆరాధన, పరిచర్యలకు మాత్రమే పరిమితం చేస్తాం. పరిచర్యలోని అన్ని పరిస్థితుల్లో ఆయన శక్తికి, బుద్ధి, జ్ఞాన, ప్రవచన, బోధనకు పరిశుద్ధాత్ముని కర్తగా చేయాలి. అప్పుడు ఆయన తనదైన వెలిగింపును, నడిపింపును తప్పక ఇస్తాడు.

**5. ప్రతి వ్యక్తి యొక్క భాగస్వామ్యాన్ని గుర్తించాలి:** దైవచిత్తాన్ని ప్రభావవంతంగా, విజయవంతంగా నిర్వహించడానికి దేవుని నడిపింపు అవసరమే. ప్రతి భాగస్వామి స్వచ్ఛందంగా పాల్గొంటూ ఆలోచనలను ఇచ్చిపుచ్చుకునే ధోరణిని కలిగి ఉండాలి. వ్యక్తుల మధ్య పరస్పర అవగాహన మరియు ఆకాంక్షలు ఇచ్చిపుచ్చుకోవాలి. అన్ని విషయాలకు మించి క్రీస్తు శరీరాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో భాగస్వాముల వుతారు.



"అంతర్గత వివాదం కేవలం మన మీద ప్రభావం చూపి, మన మనశ్శాంతిని పాడుచేయడమే కాదు, అంతిమంగా ఇతరులతో మనకున్న సంబంధాలను చెడగొడుతుంది" అని బోయస్ హగ్గట్ అంటారు.

## పరిచర్యలో సమస్యలు

ఒకపక్క దేవుడు ఈ పరిచర్యను అత్యధికంగా ఆశీర్వదిస్తుంటే, మరొకప్రక్క వ్యక్తిగతంగా, సహవాసంగా ఎదుర్కొంటున్న సవాళ్ళు, ఒత్తిళ్ళు, సమస్యలు అంతే మోతాదులో అధికమవుతున్నాయి. ఎదుర్కొంటున్న ప్రతికూల పరిస్థితులు, ఉత్సాహంపై నీరుపోసి నిరుత్సాహాన్ని ప్రతిఫలంగా ఇస్తుంటాయి. తమ ఆలోచనలకు పొందవలసిన పురికొల్పు పొందకపోవడం, ఆశించినరీతిలో పరిచర్యలో పాల్గొనే, బాధ్యతలు చేపట్టే అవకాశాలు రాకపోవడం, చేస్తున్న వ్యక్తిగత పరిచర్యను తప్పుపట్టడం, తమ భావాలను అపార్థం చేసుకోవడం వంటి పరిస్థితులు పరిచర్య తీవ్రతకు ఆనకట్ట వేస్తుంటాయి. అంతమాత్రాన, దేవుడు పిలిచిన పిలుపును పక్కనపెట్టి, సహవాసానికి దూరమయిపోయి, పరిచర్యను వదలిపెట్టడం పరిష్కారం కాదు. అలా అనుకొంటే మొదటి శతాబ్దంలో పౌలు ఒక్క సంఘాన్ని కూడా స్థాపించేవాడు కాదు.

## సమస్యలలో పౌలు చూపిన మాదిరి

పౌలు ప్రభువును నమ్ముకున్న దినాన్నుంచి అన్నీ సమస్యలే. ఒకప్రక్క ఆరోగ్య సమస్యలు, సంఘాల్లో సమస్యలు, వ్యక్తిగత దాడి (కొరింథులో), ప్రాణహాని, బహిరంగంగా అవమానపరిచే సందర్భాలు, ఎన్నో, మరెన్నో. ఏదీ తనను పరిచర్య నుంచి వెనక్కి లాగలేకపోయింది. తన జీవితం దేవునికి చెందినది అని, పరిచర్య దేవునిదేనని విశాల దృక్పథం, ఆధ్యాత్మిక పరిపక్వత తనను ముందుకు తీసుకొని వెళ్ళింది (అ.కా. 20:23,24).

## సమస్యలకన్నా సహవాసం ప్రాముఖ్యం

సమస్యలనేవి పరిచర్యకు, ఉద్యమానికి సంబంధించినవి. మనలో కొందరు ప్రతిదానిని వ్యక్తిగతంగా ఆరోపిస్తారు. సంస్థాపరంగా ఉండే నియమాలు, నిబంధనల దృక్కోణంలో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే ప్రతి చిన్న విషయానికి సున్నితంగా స్పందించడం మానుకుంటాం. మనం సహవాసంలో ఇమిడిపోవాలి. సహవాసంతోపాటు ముందుకు కొనసాగితే అప్పుడు దేవుడు మనకిచ్చిన దర్శనాన్ని భావితరానికి ఆశావాదులుగా అందించడానికి వీలువుతుంది.

మన సహవాసంలో సన్నిహితంగా కలసి లక్ష్యం కోసం సేవ చేస్తాము. కాబట్టి సహజంగా ఒకరిపట్ల మరొకరు ప్రతికూల లేక అనుకూల భావాలు ఏర్పరచుకొనే అవకాశం ఉంటుంది.

మనమందరం రకరకాల నేపథ్యాల నుంచి వచ్చి విభిన్న వ్యక్తిత్వాలను, సామర్థ్యాలను కలిగి, వివిధ రకాలుగా స్పందిస్తూ, దేవుడిచ్చిన వరాలను వినియోగిస్తూ, ఒకే పరిచర్యను విభిన్న బాధ్యతలతో ముందుకు కొనసాగించే ఒకే దేవుని బిడ్డలం. "క్రీస్తు శరీరంలో వ్యక్తులందరూ, ఒకే జీవితాన్ని పంచుకుంటూ, తమ విభిన్నతలతో ఖచ్చితంగా ఒకరికొకరు సహాయం చేసుకొంటూ, భర్తీ చేసుకొంటారు" అని అంటారు సి.ఎస్. లూయిస్. వాస్తవానికి మన పరిచర్యకు ఈ విభిన్నత్వాలు అనివార్యం. అందరూ అవసరమే. అయితే, ప్రభువు ఆశించని స్పందనలు, ఆలోచనలు, దృక్పథాలు, వైఖరి పరిచర్యలో మొలకెత్తుతున్నాయంటే వ్యక్తిగతంగా మనం దేవునితో నడిచే నడకలో, సహవాస ఆధ్యాత్మిక పరిపక్వత ఎదుగుదలలోని లోపాలను గుర్తించి సవరించుకోవాలి. సత్సంబంధాలు సక్రమంగా లేకుండా పరిచర్యలో చురుకుగా పాల్గొంటున్నాం అనే నమ్మకం దేవుని వాక్యానికి విరుద్ధం. ఇదెంత లోతుగా, సామరస్యంగా ఉంటే మన పరిచర్య అంత ఫలవంతంగా ఉంటుంది.

"అంతర్గత వివాదం కేవలం మన మీద ప్రభావం చూపి, మన మనశ్శాంతిని పాడుచేయడమే కాదు, అంతిమంగా ఇతరులతో మనకున్న సంబంధాలను చెడగొడుతుంది" అని బోయస్ హగ్గట్ అంటారు.

దైవ దర్శనంలో ఎప్పుడైతే మనం పాలుపంపులు

కలిగి ఉంటామో అప్పుడు దేవునికి ఉన్న బహు పెద్ద ప్రణాకలో భాగస్వాములై ఉంటాము.

### వ్యక్తిగతంగా పరిశీలన కొరకు ప్రశ్నలు

- నేను, నాకు ఇవ్వబడిన మొట్టమొదటి పిలుపులో నుంచి తప్పిపోతున్నానా?.అ.కా. 6:1-4.
- నేను, విశ్వాసం విషయంలో తెగువ చూపలేకపోతున్నానా? హెబ్రీ 11:8
- నా అవిధేయతను బట్టి దేవునికి వంకలు తెలియజేస్తున్నానా? యోహాను 1:1-3; యోహాను 4:2.
- దైవరాజ్య పరిచర్యలో పాల్గొనకుండా, నా స్వప్రయోజనాలు నాకు అడ్డుపడుతున్నాయా? ఎస్తేరు 4:3-16
- నేను నా దేవునిని ఆరాధిస్తున్నానా? లేక వృత్తిని లేక వ్యాపారాన్ని ఆరాధిస్తున్నానా? హబ 1:15,16
- దైవ సంబంధిత పనులను నేను శ్రద్ధగా చేస్తున్నానా? లేక వాయిదా వేస్తున్నానా? హగ్గయి 1:2-5
- ఆత్మలను గెలవడంలోనూ, సువార్తను ప్రకటించడంలోనూ ఆత్రుత కలిగియున్నానా? లేక మందగించిపోయానా? నెహెమ్యా 1:15

### ముగింపు

దర్శనం ఎల్లప్పుడు సవాళ్ళతో కూడి ఉంటుంది. సవాళ్ళను ఎదుర్కొంటూ దర్శనానికై పరిశ్రమించడం చాలా కఠినతరం అసాధ్యం అనిపిస్తుంది.. ఎప్పుడైతే దర్శనం స్పష్టంగా ఉంటుందో దాన్ని ఛేదించడం చాలా సులువవుతుంది.

పరిచర్యలో శక్తిదాయక తెగువ అవసరం. అందుకనే పౌలు ప్రభువును సేవించేటప్పుడు "ఆత్మయందు తీవ్రతతో" అని ఉంటుంది. రోమా 12:11.

దేవునిని సంతోషపరచాలనుకొనే పరిచర్యకు మనము శ్రేష్ఠమైన వాటినిస్తాం, ఉత్తమమైన రీతిలో పనిచేస్తాం. మనం నమ్మకం, స్వచ్ఛమైన దృక్పథాలతో పరిచర్య చేస్తే పరలోకంలో దేవుడు మనలను ఘనపరుస్తాడు. మనం చేసే సేవా వైఖరిని పరీక్షించుకొందాం, సంతోషంగా సేవ చేద్దాం.

దేవుడిచ్చిన వనరుల వినియోగంలో, మంచి కార్య నిర్వాహకునిగా ఉంటూ, వాటిని దేవుడు ఉద్దేశించిన విధానంలో జాగ్రత్తగా వినియోగించుకొందాం.

– యం. విజయ్‌కుమార్, చిత్తూరు

కవిత

## నిన్నటి మనుషులు



వాళ్ళు నిన్నటి మనుషులు
గతం కొమ్మల్లో చిక్కుకొన్న
గాలి పటాలు

పాతను పాతేసి
కొత్తను హత్తుకోరు
వెనకున్నవి మరచి
ముందుకు సాగిపోరు

వాళ్ళు నిన్నటి మనుషులు
గతం చుట్టూ తిరిగే గానుగ చక్రాలు

సూర్యుడు అస్తమించి
సంవత్సరాలు గడుస్తున్నా
కోపాల చీకట్లను జయించి
క్షమా కిరణాలై ఉదయించలేరు

వాళ్ళు నిన్నటి మనుషులు
ఘనీభవించిన గతానికి సాక్షి సంతకాలు

నేటిని ముంచేస్తున్న
నిన్నటి మంచును
తొలిగించుకోరు
ఏళ్ళ తరబడి కుళ్ళుతున్న
పరాభవాల బరువును
ప్రభువు పాదాల వద్ద దించుకోరు

వాళ్ళు నిన్నటి మనుషులు
రూపాంతరం చెందని లార్వాలు

మాసిన గొంగళిని మార్చేసి
రంగుల రెక్కల్ని తొడుక్కోరు
పంతాలను పట్టింపులను
పగలగొట్టుకొని బయటకు రాలేరు

వాళ్ళు నిన్నటి మనుషులు
వెనక్కి తిరుగుతున్న గడియారాలు

భవిష్యత్‌కు పట్టిన
పాతరోజుల బూజును
వదిలించుకోరు
కొత్త ఆకాశం కొత్త భూమిని
స్మరించుకోరు

– ప్రసాద్ తాళ్ళూరి



# మలుపు

విశాల్ మనసు ఆందోళనగా ఉంది. దేనిమీదా మనసు లగ్నం చేయలేకపోతున్నాడు. ఎక్కడా ఒకచోట నిలకడగా ఉండలేకపోతున్నాడు. తన ఇష్టానికి అనుకూలంగా జీవితాన్ని మలచుకోవాలని ఆశపడ్డాడు. సొంత నిర్ణయాలను అమలుపరచుకొని జీవితంలో పైకి ఎదగాలని తహతహలాడాడు. అన్నీ మనం అనుకున్నట్లుగా జరిగితే దేవుని ప్రణాళికలు మన జీవితంలో ఎలా నెరవేరతాయి?

బైక్ ముందుకు పోతుంటే ఆలోచనలు వెనక్కి పోతున్నాయి. స్నేహితులు, షికార్లు, కబుర్లు, కాల క్షేపాలతో ఇంతకాలం ఆనందంగా ఉన్నాడు. పై మెరుగులతో ఆకర్షించే లోకాన్ని, ఎప్పుడూ చుట్టూ తిరిగే స్నేహితుల్ని విడిచిపెట్టాలంటే ఏదో తెలియని బాధగా అనిపించేది. ఇంట్లో తల్లిదండ్రుల బోధలు, హితోక్తులు ఎలా ఉన్నా బయట మాత్రం తనకంటూ ఒక ప్రత్యేక లోకాన్ని ఏర్పాటు చేసుకొన్నాడు. అందుకే లక్ష్యం మీద మనసులేదు, భవిష్యత్ మీద ఆలోచన కలగలేదు. తల్లి చెప్పిన మాటలు విన్నట్లుగా నటించాడు ఇన్నాళ్ళు. ఇప్పుడెందుకో ఆ మాటలు గుర్తొచ్చే కొద్దీ వాళ్ళెంత అనుభవంతో చెప్తారో అర్థమవ్వసాగింది.

"చూడరా.... నీ వయసు వాళ్ళు వేటి గురించి ఆలోచిస్తారో నాకు తెలుసు. చుట్టూ నలుగురు స్నేహితులు, చేతిలో నాలుగు రూపాయలు ఉంటే చాలనే భ్రమల్లో బతుకుతుంటారు. కానీ వాటన్నిటినీ సమకూర్చిన వాడు దేవుడేననే స్పృహ ఉండదు. రోజు మొత్తాన్ని ఇష్టమైన పనుల కోసం కేటాయించుకొంటావు. కనీసం కొద్ది సమయమైనా దేవుని సన్నిధిలో గడపడానికి ఇష్టపడవు. నువ్వే ఇలా ఉంటే నీతో ఉన్న నీ స్నేహితులకు దేవుని గురించి ఏమని చెప్తావు? వాళ్ళ మధ్య సాక్షిగా ఎలా నిలబడతావు?"

"సాక్షిగా ఉండడం" అనే మాటను తల్చుకోగానే పెదాలపై చిరునవ్వు వచ్చింది. తనంతట తానుగానే సర్వ నాశనమయ్యే దారిని ఎంచుకున్నాడు. ఇంక 'సాక్షి' అనే మాటకి తన జీవితంలో చోటేది? సాక్షిగా నిలబడగలిగే పవిత్రత తనలో ఎక్కడుంది? పిచ్చి తల్లులు... పిల్లల్ని గుండెల్లో పెట్టుకొని పెంచుతారు. తాము మాత్రం వాళ్ల మాటల్ని పెడచెవిన పెట్టి పెడత్రోవలు పట్టి కనుమరుగవుతుంటారు.

వెనకనుంచి హారన్ మోత వినిపించడంతో ఆలోచనల్లో నుంచి బయటికి వచ్చి అన్యమనస్కంగా బైక్‌ని మలుపు తిప్పాడు. అనుకోకుండా అటు నుంచి వేగంగా వచ్చిన ఆటోని గుద్ది డివైడర్ మీద పడిపోయాడు. ఊహించని హఠాత్పరిణామంతో ఒక్కసారిగా విశాల్ కళ్ళు బైర్లు కమ్మాయి.

***

కళ్ళు తెరిచేసరికి ఆసుపత్రి బెడ్ మీద ఉన్నాడు విశాల్. తలమీద, కాళ్ళకు కట్లు కనిపించడంతో మనసంతా నీరసంగా అయిపోయింది. డివైడర్ దగ్గర మలుపు తిరగబోయి బైక్ స్కిడ్ అయినట్లుగా మాత్రమే గుర్తుంది. ఆ తర్వాత ఏమైందో తెలియలేదు. ఎవరు తీసుకొచ్చి ఆసుపత్రిలో

జాయిన్ చేశారో కూడా తెలియదు. ఒక్కో బొట్టూ ఒంట్లోకి నిశ్శబ్దంగా జారుతున్న సెలైన్ బాటిల్, హడావిడిగా అటుఇటూ తిరుగుతున్న నర్స్‌లు, పక్క బెడ్స్‌మీదున్న కొద్దిమంది పేషెంట్స్ కనిపించారు. తనకు సంబంధించిన వారెవరైనా ఉన్నారేమోనని చుట్టూ చూస్తున్న విశాల్‌కి "తమ్ముడూ... ఇప్పుడెలా ఉంది?" అని వినిపించడంతో అతనివైపు చూశాడు. భుజాన చేతిసంచితో సాధారణంగా ఉన్న వ్యక్తి కనిపించాడు.

"తమ్ముడూ... డివైడర్ దగ్గర రక్తం కారుతూ పడివున్న నిన్ను చూసి హడావిడిగా ఇక్కడికి తీసుకొచ్చాను. కొద్దిగా రక్తం పోయింది, మిగతాదంతా బాగానే ఉందని చెప్పారు డాక్టర్స్. నీ జేబులో ఉన్న మొబైల్ నుంచికాల్ లిస్ట్‌లో ఉన్నకొన్ని నంబర్లకు ఫోన్ చేశాను. ఒకరిద్దరు లిఫ్ట్ చేస్తే విషయం చెప్పాను. మీ ఇంటికి కూడా చేసి విషయం చెప్పాను తమ్ముడూ... ఈ పాటికి వచ్చేస్తూ ఉంటారు"అని చెప్తున్న అతని వంక నీళ్ళు నిండిన కళ్ళతో చూశాడు విశాల్.

ఇంతలో కొద్దిదూరంలో ఉన్న బెడ్ నుంచి ఒక్కసారిగా గొల్లుమని ఏడుపులు వినిపించాయి. పోయిన వ్యక్తి సంబంధీకులు గుండెలు బాదుకుంటూ ఏడవసాగారు. ఆ దృశ్యం చూసిన విశాల్ మనసు వికలమై పోయింది. చావుకీ, బతుక్కీ మధ్య కనిపించకుండా ఉన్న సన్నని గీతేదో అతనిలో అమితమైన దు:ఖాన్ని, అపారమైన భయాన్ని కలిగించింది. ఎవరో చెప్పినట్లు... కన్ను తెరిస్తే జననం, కన్ను మూస్తే మరణం! అనుకోనిదేదైనా జరిగితే, తన ప్రాణమూ అలాగే పోతే ఈ పాటికి తనగతి ఏమై ఉండేది? తనను అమితంగా ప్రేమించే తల్లిదండ్రుల పరిస్థితి ఎలా ఉండేది? ఇన్నాళ్ళూ తనకు నచ్చినట్లుగా బతికిన ఇష్టానుసారమైన బతుకు తప్ప తను ఏమి సాధించాడు?

గుండె లోలోతుల్లో నుంచి దు:ఖం వెల్లువలా పొంగింది. దేవునికి దూరంగా, లోకానికి దగ్గరగా జరిగి తానేమి సాధించాడో అర్థం కాలేదు.

"ఏం తమ్ముడూ... భయపడుతున్నావా?"

"లేదన్నా" అన్నట్లుగా తల అడ్డంగా ఊపాడు.

"మరెందుకు ఏడుస్తున్నావు"

"ఏమోనన్నా..."

"ఏమీ ఆలోచించకు. కళ్లుమూసుకొని హాయిగా రెస్ట్ తీసుకో. దేవుడు నిన్ను కనికరిస్తాడు. నీకేమీ కాదు. అమ్మా, నాన్నవాళ్లు వచ్చేస్తారు, భయపడకు" అనడంతో అతనివంక కృతజ్ఞతగా చూస్తూ కళ్ళు మూసుకున్నాడు. ఒక్కసారిగా కళ్ళముందు చీకటి కదలాడింది.'ఆ చీకట్లో దేనికోసమో విశాల్ తిరుగులాడుతున్నాడు. ఎటు తోస్తే అటు వెళ్తున్నాడు. 'ఒరేయ్ ఒరేయ్' అంటూ స్నేహితులు కూడా అతన్ని వెంబడిస్తున్నారు. ఒక్కసారిగా దారికనబడని భయంకరమైన చీకట్లో స్నేహితులతో పాటు విశాల్ కూడా పెద్ద అగాధంలో పడిపోయాడు'. ఒక్కసారిగా ఉలిక్కిపడి కళ్ళు తెరిచి చుట్టూ చూశాడు. దూరంగా ఏడ్చుకొంటూ అన్నతో మాట్లాడుతున్న తల్లిదండ్రులు కనిపించారు. కడుపులో బాధ లుంగలు చుట్టుకుపోయింది. తనను కన్నందుకు తల్లిదండ్రులకెంతో క్షోభ మిగిల్చాననే ఆలోచన విశాల్‌ని నిలవనీయడం లేదు. చేయెత్తి దగ్గరకు రమ్మన్నట్లుగా సైగ చేశాడు.

అందరి కళ్లలోనూ కన్నీళ్ళే!

ఒకరివైపు ఒకరు చూసుకుంటూ ఏడ్చుకొంటున్నారే తప్ప ఎవరూ మాట్లాడుకోవట్లేదు.

"చూడు తమ్ముడూ... అమ్మ నాకు అన్ని విషయాలూ చెప్పారు. విశాలమార్గంలో సంతోషాలుండవచ్చు. కానీ అవి శాశ్వతం కాదు. ఇరుకుమార్గంలో ప్రయాణం కష్టంగా అనిపించవచ్చు. కానీ ఆ దారి దేవుడి దగ్గరకు నడిపిస్తుంది. అన్ని పనులూ చేయడానికి దేవుడు మనకు అనుమతినిచ్చాడు. కానీ వాటిలో చేయదగినవేవో, చేయకూడనివేవో నిర్ణయించుకొనే విచక్షణ కూడా మనకే ఇచ్చాడు. చదువైనా, ఉద్యోగమైనా, జీవితంలో మరే ఇతర అంశమైనా నువ్వు తీసుకొనే మలుపు మీదే ఆధారపడి ఉంటుంది. ఆ మలుపు నీ జీవితాన్ని అమితంగా ప్రభావితం చేయవచ్చు. నీ జీవితాన్ని కొత్త దారిలో నడిపించవచ్చు. నీ చేత అద్భుతాలు చేయించవచ్చు. అన్నిటినీ మించి దేవుడిని గుర్తెరిగి, నిన్ను నువ్వు ఆయనకు సంపూర్ణంగా సమర్పించుకొని, ఆయన కోసం నిలబడాలనే ఆలోచనను అనుగ్రహించవచ్చు. జీవితంలో ఏ నిమిషం ఎలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు. దేవుడు నీకిచ్చిన ఈ కొత్త జీవితాన్ని సరి కొత్తగా ప్రారంభించు తమ్ముడూ"

చెప్తున్న అన్న వంక కృతజ్ఞతగా చూశాడు విశాల్.

**– డా. జడా సుబ్బారావు,** నూజివీడు



# పరీక్షల వేళ... ప్రిపరేషన్ ఎలా?

*"...మీరేమి చేసినను సమస్తము దేవుని మహిమ కొరకు చేయండి"* – *1 కొరింథీ 10:31*

శ్యామ్, రమేష్‌లు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభువును అంగీకరించిన విశ్వాస విద్యార్థులు. కళాశాలలో చేరడం, కొద్ది రోజులకే వారి స్నేహితుల ఆహ్వానం మేరకు ఒక గాస్పల్ రిట్రీట్‌కు హాజరవడం, అందులో వారు ప్రభువైన యేసుక్రీస్తును విశ్వసించడం జరిగిపోయాయి. సంక్రాంతి సెలవులు, కరోనా మూడవ వేవ్ వెంటవెంటనే వచ్చాయి. కరోనా మూలంగా ఈ విద్యా సంవత్సరం కూడా నష్టపోవాల్సి వస్తుందేమోనని భయపడ్డారు. కరోనా ప్రభావం పెద్దగా లేకపోవడంతో సెలవుల అనంతరం కళాశాలకు వచ్చారు. సుమారు నెల తర్వాత పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. దీనితో కొంత ఆనందం, కొంత భయం కలిగింది. గత రెండేళ్ళుగా ఎలాంటి వార్షిక పరీక్షలు వారు రాయలేదు. సరిగా క్లాస్‌లు కూడా జరగలేదు. కొంత ఆన్‌లైన్, కొంత ఫిజికల్ క్లాస్‌లు జరిగినా, పాఠ్యాంశాలను విన్నది, నేర్చుకొన్నది అంతంత మాత్రమే. ఆ ప్రభావం వారికి ఇంటర్‌లో కనిపిస్తుంది. ఈ సంవత్సరం కూడా క్లాసులు ఆలస్యంగా మొదలయ్యాయి. పాఠ్యాంశాల బోధన హడావుడిగా జరిగింది. అంతలోనే పరీక్షల షెడ్యూల్ వచ్చేసింది. ఇప్పుడు ఉన్న కొద్ది సమయంలో పరీక్షలకు సరిగా సిద్ధపడి, మంచి మార్కులు సంపాదించగలమా లేదా అనే ఆందోళన, భయం శ్యామ్, రమేష్‌లలో మొదలైంది.

ప్రస్తుతం విద్యార్థులందరి పరిస్థితి దాదాపు ఇలానే ఉన్నది. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులు ఒత్తిడికి, ఆందోళనకు గురయ్యే అవకాశం ఉన్నది. తద్వారా వారి ఆరోగ్యం కూడా పాడయ్యే అవకాశం ఉంది.

కొన్ని మెళకువలు, జాగ్రత్తలు పాటిస్తే ఇలాంటి పరిస్థితులు రాకుండా చూసుకోవచ్చు. అంతేకాదు, సమర్థవంతంగా సిద్ధపడి పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవచ్చు. ఆ మెళకువలను, జాగ్రత్తలను క్లుప్తంగా తెలుసుకొందాం.

1. **మౌనధ్యానం, ప్రార్థన చేసుకోవాలి:** పరీక్షలకు సిద్ధపడే సమయంలో, పరీక్షలు జరిగే రోజుల్లో కూడా దేవుని వాక్యాన్ని చదివి, ధ్యానించి, అన్వయించుకోవడానికి, ప్రార్థనకు ఖచ్చితంగా సమయం కేటాయించుకోవాలి. ఇది ఆత్మీయ జీవితానికి బలాన్నిస్తుంది. అంతేకాదు, దేవుని సన్నిధిలో అర్థవంతమైన సమయాన్ని గడపడం ద్వారా ఆందోళన, ఒత్తిడి వంటి మానసిక సమస్యలు దూరమౌతాయి. దేవుడు నాకు సహాయం చేస్తారు, సమర్థవంతంగా సిద్ధపడి, మంచి మార్కులు సంపాదించుకోగలను అనే నమ్మకాన్ని, మనోధైర్యాన్ని దేవుడు ఇస్తారు.
2. **విరామం, విశ్రాంతి అవసరం:** ఒక వ్యక్తి మనస్సు రోజుకు 16 గంటలు వరకు విషయాలను స్వీకరించి, నిల్వచేసుకోగలదు. కాబట్టి రోజుకు 16 గంటలు చదవడానికి ప్రణాళిక సిద్ధంచేసుకోవాలి. అలాఅని విరామం లేకుండా

చదవడం కూడా మంచిది కాదు. గంట గంటకు 5ని. విరామం తీసుకోవాలి. ఈ విరామంలో రిలాక్స్ అవ్వాలి.

3. పరీక్షల సమయంలో ఇంతకు ముందు చదవని అంశాల జోలికి వెళ్ళకుండా ఉంటే మంచిది. క్రొత్త సమాచారంతో ఇబ్బంది పడకూడదు. చదివిన అంశాలనే మరలా మరలా చదవాలి. ఒక అంశాన్ని కనీసం మూడు సార్లయినా రివిజన్ చేసుకొంటే పరీక్షల్లో ఎంతో సులభంగా, త్వరగా ఆ అంశం గుర్తుకొస్తుంది.

4. చదివిన అంశాలన్నీ జ్ఞప్తికి తెచ్చుకొనే విధంగా సహాయం చేయమని ప్రతిరోజు దేవుని ప్రార్థించుకో. దేవుడు సహాయం చేస్తాడనే విశ్వాసంతో, ధైర్యంగా ఉండు.

5. సంవత్సరాంతంలో, సెమిస్టర్ పరీక్షలు మన భవిష్యత్తును నిర్ణయిస్తాయి. గనుక శ్రద్ధగా చదవడం అవసరం. అలా అని ఆందోళన చెందాల్సిన అవసరం కూడా లేదు.

6. అన్ని సబ్జెక్టులు ఒకేరోజు చదవడం కన్నా, ఏఏ సబ్జెక్ట్స్, ఏఏ రోజుల్లో, ఎంతవరకు చదవాలో టైమ్ టేబుల్ వేసుకొంటే సిద్ధపాటు సులభంగా, అర్థవంతంగా ఉంటుంది.

7. మంచం మీద పండుకుని, టివి చూస్తూ, సెల్‌ఫోన్‌లో ఫేస్‌బుక్, వాట్సప్, యూట్యూబ్ చూస్తూ లేదా మ్యూజిక్/పాటలు వింటూ చదవకూడదు. దాని వలన ఏ మాత్రం ఉపయోగం ఉండదు. నీవు ప్రశాంతంగా చదవగలిగే ఒక ప్రాంతాన్ని ఎంచుకో. ఎలాంటి అంతరాయాలు లేని ప్రదేశంలో ఏకాగ్రతతో చదవగలుగుతారు.

8. ఉదయాన్నే నిద్రమేల్కొని, మౌనధ్యానం తర్వాత కఠినంగా ఉన్న అంశాలను చదవాలి. ఈ సమయంలో మనస్సు ప్రశాంతంగా ఉంటుంది కాబట్టి వాటిని సులభంగా నేర్చుకోగలుగుతారు.

9. చదువులో దేవునిని మహిమపరచాలని లక్ష్యాన్ని తరచూ జ్ఞాపకం చేసుకుంటూ, స్ఫూర్తి పొందుతూ, ఏకాగ్రతతో చదువుతూ శ్రమించాలి.

10. పెందలకడనే అంటే 10గం॥కే నిద్రపోవాలి. వేకువజామున లేవాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి. సరైన ఆహారం సరిపడా తినాలి. ద్రవపదార్థాలు (నీరు, మజ్జిగ, పండ్లు) ఎక్కువగా తీసుకోవాలి. లేకుంటే అనారోగ్యం పాలవ్వాల్సివస్తుంది.

11. ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్ వంటి వాటికి దూరంగా ఉండడం మంచిది. వీటివల్ల సమయం వృథా కావడమే కాకుండా, చదువుపై ఏకాగ్రత దెబ్బతింటుంది.

12. పరీక్షల సమయంలో క్రికెట్ మ్యాచ్ జరుగుతుంటే పట్టించుకోకు. క్రికెట్ మ్యాచ్‌కన్నా నీ భవిష్యత్ నీకు ముఖ్యం.

13. పరీక్ష ముందురోజు మరీ ఎక్కువగా చదవకూడదు. మనస్సుకు తగినంత విశ్రాంతినిస్తే, పరీక్ష చాలా ప్రశాంతంగా రాయగలుగుతారు. నిద్రపోయే ముందు ఒక 5ని. రిలాక్స్‌అవ్వడం ఎంతో ఉత్తమం.

14. హాల్‌టికెట్, పెన్స్, పెన్సిళ్ళు, స్కేలు మొ॥ వాటిని పరీక్షముందురోజే సిద్ధంగా ఉంచుకోవాలి. అలారం పెట్టుకొని పరీక్షరోజుల్లో పెందల కడనే నిద్రలేవాలి. తద్వారా అనవసరమైన ఆందోళనను దూరం చేయవచ్చు.

15. ఒక వాటర్‌బాటిల్‌ను పరీక్షహాల్‌కు తీసుకెళ్ళడం మంచిది.

16. ప్రశ్నాపత్రాన్ని అంతా జాగ్రత్తగా చదవాలి. బాగా రాయగలిగిన/వచ్చిన ప్రశ్నలను ముందుగా రాయడం మంచిది.

17. చేతిరాత చక్కగా ఉండేటట్లు జాగ్రతపడాలి. అక్షర దోషాలు లేదా మిస్టేక్స్, కొట్టివేతలు లేకుండా చూచుకోవాలి.

18. సమయాన్ని గమనిస్తూ, అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. రాని ప్రశ్నలను వదిలివేయకుండా కనీసం ఎటెంప్ట్ చేయాలి.

19. కాపీయింగ్, తోటివారికి సహాయం చేయడం విశ్వాసిగా మనకు తగవు. ఇటువంటి అనైతిక చర్యలు దేవుని నామానికి అవమానాన్ని తీసుకువస్తాయి.

20. మంచి ఫలితాలు ఇవ్వమని ప్రతిరోజు దేవుని ప్రార్థించు. మన కష్టాన్ని ఆయన ఖచ్చితంగా ఆశీర్వదిస్తాడు.

**– పి.రామస్వామి,** దర్శి

# నిర్ణయాలు

## జీవిత దిశ, దశను మార్చేవి


"1958-62 సం॥లను 'మంచి భవిష్యత్ కోసం అద్భుతమైన అడుగులు వేసే కాలం'గా ప్రకటిస్తున్నాను. పారిశ్రామికీకరణ, సమిష్టిసేద్యం వంటి ప్రణాళికలతో మనదేశం అమె రికా, బ్రిటన్‌లను మించి ఆర్థిక ప్రగతి సాధిస్తుంది. అయితే ప్రజల ఆహార ధాన్యాలను, పండ్లను పక్షులు తిని వృథా చేస్తున్నాయి. దీనిని అరికట్టడానికి 'నాలుగు కీటకాలపై దండయాత్ర' జరగాలి. దేశంలో 'పిచ్చుకలు, ఎలుకలు, ఈగలు, దోమలు' లేకుండా సమూల నాశనం చేయండి" అని ఆదేశించాడు అప్పటి చైనా అధ్యక్షుడు మావో జడాంగ్.

ప్రజలు, అధికారులు, సైన్యం రంగంలోకి దిగి పక్షిగూళ్ళను పడద్రోసి, గుడ్లను పగులగొట్టి, పిల్లలను చంపేశారు. పక్షులు నేలపై వాలకుండా చేశారు. రోజుకు రెండు లక్షల చొప్పున పక్షులన్నింటిని చంపేశారు. అయితే కీటకాలను తినే పక్షులు లేనందువల్ల పొలాల్లో మిడతలు, కీటకాల సంఖ్య విపరీతంగా పెరిగి పంటలను తినేశాయి. పర్యావరణ సమతుల్యం దెబ్బతింది. వరుసగా మూడు సం॥లు పంటలు పాడై దేశంలో కనీవినీ ఎరుగని గొప్ప కరువు సంభవించింది. ఆహారం కోసం లెక్కలేనన్ని హత్యలు జరిగాయి. వీటన్నింటి ఫలితంగా నాలుగు కోట్ల యాభై లక్షల మంది ప్రజలు మరణించారు. మావో చేసిన ఒక్క నిర్ణయం చైనాదేశం మొత్తాన్ని అతలాకుతలం చేసింది.

### నిర్ణయాలు తీసుకొనే సామర్థ్యం

దేవుడు మానవుడిని తన స్వరూపంలో సృజించినప్పుడు స్వేచ్ఛ ఇచ్చాడు. దేనినైనా ఎంపిక చేసుకొనే మానసిక సామర్థ్యం, నిర్ణయాలు తీసుకొనే అధికారం ఇచ్చాడు. కాబట్టి సహజసిద్ధంగా నిర్ణయాలు తీసుకొనే లక్షణం, సామర్థ్యం అందరికీ ఉంటుంది. అందుకే మనం రోజూ అనేక నిర్ణయాలు తీసుకొంటాం. నిర్ణయాలు తీసుకోవడానికి ప్రధానంగా రెండు నైపుణ్యాలు అవసరం. ఒకటి ఊహించడం, రెండు అంచనా వేయడం. ఇవి అందరికీ ఉంటాయి. ఎవరైతే ఈ లక్షణాలను సమర్థవంతంగా ఉపయోగిస్తారో వారు సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. మావో మంచి కోసమే నిర్ణయం తీసుకొన్నా సరిగ్గా ఊహించడం, అంచనా వేయడంలో విఫలమై చెడ్డ నిర్ణయం చేశాడు.

బైబిల్‌లో యెరికోను వేగుచూడడానికి ఇద్దరు ఇశ్రాయేలీయులు వెళ్ళినప్పుడు ఈ లక్షణాల ఆధారంగానే రాహాబు సరైన నిర్ణయం చేసింది. వీరి సంగతి దేశ రాజుకు వర్తమానం వెళుతుందనీ, ఆయన





చాలాసార్లు తప్పుడు నిర్ణయాలు చేయడానికి మొహమాటం, తప్పుడు నమ్మకాలు, తాత్కాలిక భావోద్వేగాలు, లోకపు ఆకర్షణలకు, బెదిరింపులకు లొంగిపోవడం, మనకుండే అనుమానాలు, అపార్థాలు, అభ్యంతరాలు, ఆవేశాలు, అవమానాలు కారణాలు అవుతున్నాయి. కారణాలు ఏవైనప్పటికీ "తప్పుడు నిర్ణయాలు తీసుకోవడాన్ని అర్థం చేసుకోవచ్చు. అయితే ఆ తప్పుల నుండి ఎప్పుడూ నేర్చుకోక పోవడమే అసలైన సమస్య" అంటారు ఫిల్ క్రాస్బీ.

సైనికులను పంపిస్తాడనీ ముందుగానే ఊహించి సిద్ధంగా ఉంది. వీరిద్దరిని దాచిపెట్టి కంగారు పడకుండా సైనికులకు సమాధానం చెప్పి పంపించింది. వీరిని వెదుకుతూ వారు యొర్దాను వరకు వెళ్ళి తిరిగి వచ్చే సరికి మూడు దినాలు అవుతుందని అంచనా వేసింది. విన్న సంగతుల ఆధారంగా వీరి దేవుడు నిజమైన, బలమైన వాడని గ్రహించి "యెహోవా ఈ దేశమును మీకిచ్చుచున్నాడని... నేనెరుగుదును" (యెహో. 2:9) అని చెప్పింది. అలా సరైన నిర్ణయం తీసుకొన్న రాహాబు తనతోపాటు తన కుటుంబ సభ్యులను కాపాడుకొంది. అందుకే "విషయ పరిజ్ఞానం కంటే ఊహించడం చాలా ముఖ్యమైంది. విషయ పరిజ్ఞానం మనకు తెలిసిన విషయాలకు పరిమితమవుతుంది. తర్కం నీకు తెలిసినదానిలో హేతుబద్ధత ఉందో లేదో చెబుతుంది. కానీ ఊహించడం నిన్ను విశ్వమంతటిలోకి నడిపించి తెలియనివి తెలుసుకొనేలా సహాయపడుతుంది. కాబట్టి ఒక వ్యక్తి అసలైన ప్రజ్ఞా సామర్థ్యం ఊహించడమే" అంటారు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్.

### నిర్ణయాల ఫలితాలు, పర్యవసానాలు

ప్రతి నిర్ణయానికి నీడలా వెన్నంటివుండేది దాని ఫలితం, పర్యవసానం. మన ఇష్టం చొప్పున నిర్ణయాలు తీసుకొంటాం. అయితే వాటి పర్యవసానాలు మన చేతుల్లో ఉండవు. ఉదా॥ ఎత్తైన స్థలం నుంచి దూకాలో, వద్దో నిర్ణయించుకొనే స్వేచ్ఛ నీకు ఉంది. కానీ దూకితే – కింద పడిపోకుండా, నేలకు బలంగా తగలకుండా, దెబ్బలు తగలకుండా ఆపడం నీ చేతుల్లో ఉండవు. కాబట్టి స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకొనేముందు దాని ఫలితాలు, పరిణామాలు, పర్యవసానాలు జాగ్రత్తగా ఆలోచించుకోవడం అవసరం.

బైబిల్‌లో లూసీఫర్ తీసుకొన్న నిర్ణయం ఫలితంగా అతడు సాతానుగా మారాడు. ఆదాము హవ్వల నిర్ణయం వారికి అపరాధ భావన, సిగ్గు, శ్రమ, బాధ, దేవుని సన్నిధి నుండి, తోటలో నుండి వెలివేత, మరణం మొ॥గు పర్యవసానాలకు దారితీసింది. దీని ఫలితం వారికే పరిమితం కాకుండా యావత్ మానవజాతిపై పడింది. అందుకే "మనకు ఏమి చేయాలో నిర్ణయించుకొనే స్వేచ్ఛ ఉంది గానీ, ఆ తరువాత సంభవించే పర్యవసానాలను ఎంచుకొనే స్వేచ్ఛ లేదు" అంటారు జిగ్ జిగ్లర్. చెడ్డ నిర్ణయాలకు మంచి ఫలితాలు ఆశించడం సాధ్యం కాదు. ఏ విత్తనం విత్తితే ఆ పంటనే కోస్తావు. టమోటా విత్తనాలు విత్తితే టమోటాలే కాస్తాయి, పుచ్చకాయలు కాయవు.

దృశ్య మాధ్యమాల్లో ఎక్కువగా పొగతాగడం, ప్రేమ, సహజీవనం, వ్యభిచారం, జూదం మొ॥ వాటిని గొప్పగా, ఆకర్షణీయంగా, నాగరికతగా చూపిస్తున్నారు. కానీ వాటి పర్యవసానాలైన వ్యాధులు, విడాకులు, ప్రమాదాలు, సంఘర్షణలు మొ॥ వాటిని పెద్దగా చెప్పడం లేదు. వీటిని అర్థం చేసుకొనేటప్పటికి సమయం మించిపోతుంది. నేటితరంలో స్వేచ్ఛ ముసుగులో స్వార్థం, తిరుగుబాటుతనం ఎక్కువగా ఉన్నాయి. స్వేచ్ఛను ఒక హక్కుగానే చూస్తున్నారు గానీ దాని పర్యవసానాల పట్ల కనీస అవగాహన, బాధ్యత కలిగి ఉండడం లేదు.

ప్రతి నిర్ణయానికి పర్యవసానం ఉంటుంది అనే నియమం దేవుని విషయంలో కూడా సత్యమే. మానవులు పాపం చేస్తారని తెలిసి వారిని సృజించాడంటే, వారికి స్వేచ్ఛను ఇచ్చాడంటే వచ్చే పర్యవసానాలకు సిద్ధపడ్డాడు. ముందే విమోచన గురించి నిర్ణయించుకొన్నాడు. మానవరూపం ధరించడానికి, వారి పాపాలకు తానే శిక్ష అనుభవించడానికి, మరణించడానికి ముందే నిర్ణయించుకొని ఆ తరువాత సృజించాడు. తన సృష్టికి, తదనంతర పరిణామాలకు బాధ్యత తీసుకొన్నాడు. అది దేవుని గొప్పతనం. అందుకే "గొప్పతనానికి వెల బాధ్యత" అంటారు విన్‌స్టన్ చర్చిల్.

కొన్నిసార్లు సరైన నిర్ణయాలు తీసుకొన్నప్పుడు నష్టం, కీడు కలిగించే ఫలితాలు ఎదురవుతాయి. అప్పుడే వారి అసలైన భక్తి బయటకు వస్తుంది. యోసేపు, షద్రకు, మేషాకు, అబేద్నెగోలు, దానియేలు, మరియు మొ॥వారు ఎదురయ్యే పర్యవసానాలు భరించడానికి సిద్ధపడ్డారు. అందుకే "క్రీస్తుయేసు నందు సద్భక్తితో బ్రతక నుద్దేశించు వారందరూ హింస పొందుదురు" (2తిమో.3:12) అని బైబిల్ చెబుతుంది

## పర్యవసానాలు ఎలా ఎదుర్కోవాలి?

చాలామంది తమ నిర్ణయాలకు బాధ్యత తీసుకోరు, వాటినుండి పాఠాలు నేర్చుకోరు. పైగా పరిస్థితులపై, ఇతరులపై నిందలు వేస్తారు. కొందరు ఏదైనా జరగగానే ఆ పరిస్థితుల నుండి పారిపోతారు. ఇంకొందరు వెనక్కువెళ్ళి నిర్ణయాలు మార్చుకోవాలని ఆశిస్తారు కానీ సాధ్యం కాక జరిగినదానిని తలచుకొంటూ చింతిస్తూ ఉంటారు. సవాళ్ళను ఎదుర్కోకుండా, భవిష్యత్తును నిర్లక్ష్యం చేస్తారు. మరికొందరు సణుగుతూ, గొణుగుతూ, వ్యసనపడుతూ దేవునికి వ్యతిరేకంగా మాట్లాడతారు. అలా కాకుండా బాధ్యత తీసుకొని దానిగుండా వెళ్ళినప్పుడు చాలావరకు దాని వ్యతిరేక ప్రభావాన్ని తగ్గించవచ్చు.

బైబిల్లో నయోమి తన పరిస్థితులను తలచుకొని "సర్వశక్తుడు నాకు చాలా దు:ఖము కలుగజేసెను గనుక నన్ను నయోమి అనక మారా అనుడి... సర్వశక్తుడు నన్ను బాధపరచెను" (రూతు 1:20, 21) అని పలికింది. కానీ పరిస్థితులు అలాగేవున్నా రూతు ఎవరినీ నిందించలేదు, పైగా అదే దేవుడిని నమ్ముకొంది. పరిస్థితులు ఎలాగున్నా బాధ్యత తీసుకొంది. పొలంలో శ్రద్ధగా పరిగె ఏరుకొంది, కష్టపడి పనిచేసింది. సత్ప్రవర్తనతో మంచిసాక్ష్యం పొందింది. ఓపికగా వేచివున్నందుకు బోయజు ద్వారా కొత్త జీవితం పొందుకొంది. అందుకే "నీవు తప్పనిసరిగా బాధ్యత తీసుకోవాలి. నీవు పరిస్థితులను, కాలాలను, వచ్చే గాలి తుఫానులను మార్చలేవు. కానీ నిన్ను నీవు మార్చుకోగలవు" అంటారు జిమ్ రోహన్.

## తప్పుడు నిర్ణయాలు ఎందుకు తీసుకొంటారు?

జీవితంలో ఒక్క తప్పుడు నిర్ణయం కూడా తీసుకోని వ్యక్తి ఎవరూ ఉండరు. దీనికి ముఖ్య కారణం మన ఆలోచనా విధానం, పాపస్వభావం. మొదట ఏ పాపం లేని లూసీఫర్ తన స్థాయికి, మూలాలకు, పరిమితులకు భిన్నంగా దేవుని స్థానం ఆశించడం కేవలం దురాశే. అదే దురాశ కలిగేలా ఆదాము హవ్వలను శోధించి వారు కూడా చెడ్డ నిర్ణయం తీసుకొనేలా చేసాడు. అందుకే "ప్రతివాడును తన స్వకీయమైన దురాశ చేత ఈడ్వబడి మరలు కొల్పబడినవాడై శోధింపబడును. దురాశ గర్భము ధరించి పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణమును కనును" (యాకో. 1:14,15) అని బైబిల్ చెబుతుంది.

చాలాసార్లు తప్పుడు నిర్ణయాలు చేయడానికి మొహమాటం, తప్పుడు నమ్మకాలు, తాత్కాలిక భావోద్వేగాలు, లోకపు ఆకర్షణలకు, బెదిరింపులకు లొంగిపోవడం కారణాలు అవుతున్నాయి. కొన్నిసార్లు మనకుండే అనుమానాలు, అపార్థాలు, అభ్యంతరాలు, ఆవేశాలు, ఎదురైన అవమానాలు తప్పుడు ఎంపికలకు కారణాలు అవుతున్నాయి. కారణాలు ఏవైనప్పటికీ "తప్పుడు నిర్ణయాలు తీసుకోవడాన్ని అర్థం చేసుకోవచ్చు. అయితే ఆ తప్పుల నుండి ఎప్పుడూ నేర్చుకోక పోవడమే అసలైన సమస్య" అంటారు ఫిల్ క్రాస్బీ. అందుకే "మంచి నిర్ణయాలు తీసుకోవడానికి అనుభవం ఉపయోగపడుతుంది. అయితే ఆ అనుభవం చెడ్డ నిర్ణయాల నుంచి నేర్చుకొనే పాఠాల ద్వారా వస్తుంది" అంటారు మార్క్ ట్వైన్. "నా జీవితంలో నేను తొమ్మిదివేల షాట్లు కొట్టడంలో విఫలమయ్యాను. సుమారు మూడు వందల ఆటల్లో ఓడిపోయాను. ఇరవై ఆరుసార్లు గెలిచే షాట్‌లను చివరి నిమిషంలో జారవిడిచాను. నేను పదేపదే విఫలమవుతూ గెలవడం నేర్చుకొన్నాను" అంటారు ప్రఖ్యాత బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు మైఖేల్ జోర్డాన్.

## సరైన నిర్ణయాలు ఎలా తీసుకోవాలి?

ఏ నిర్ణయమైనా దేవుని చిత్తానుసారంగా, ప్రార్థనా పూర్వకంగా తీసుకోవాలని వాక్యం సెలవిస్తుంది. అయితే నిర్ణయాలు తీసుకొనే విషయంలో ప్రధానంగా మూడు దశలు ఉంటాయి. ఒకటి - ఇంగిత జ్ఞానం ఉపయోగించడం, రెండు-వాక్యంలో ఉన్న దైవ

నియమాలను అర్థం చేసుకోవడం, మూడు – దేవుని నడిపింపును గ్రహించడం.

### 1. ఇంగితజ్ఞానం (కామన్‌సెన్స్) ఉపయోగించడం:

ప్రతి విషయంలోనూ ప్రార్థనా పూర్వకంగా ఉంటూ దేవుడు మనకు ఇచ్చిన ఇంగితజ్ఞానం ఉపయోగించి ప్రతిరోజు చాలా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. బైబిల్‌లో దీనా ఇంగితజ్ఞానం విస్మరించి కొత్త ప్రదేశంలో ఒంటరిగా బయటకు వెళ్ళి ప్రమాదంలో చిక్కుకొంది. అలాగే పరిమిత వేగంతో వాహనం నడపడం, పెద్దలను గౌరవించడం, సకాలంలో రైల్వేస్టేషన్‌కు చేరుకోవడం, మొదటి నుండి కష్టపడి చదవడం, కొన్ని విషయాల్లో అనుభవజ్ఞుల సలహాలు తీసుకోవడం మొదలైనవన్నీ ఇంగితజ్ఞానానికి చెందిన విషయాలు. బైబిల్‌లో రెహబాము అనుభవజ్ఞుల సలహా కాకుండా స్నేహితుల సలహా తీసుకొని నష్టపోయాడు. మన ఆసక్తి, అభిరుచి, అంతర్గత సామర్థ్యాలకు అనుగుణంగా చదివే సబ్జెక్టులు, చేసే వృత్తులను పార్థనాపూర్వకంగా నిర్ణయించుకోవాలి.

కొన్ని విషయాలలో మనం ప్రార్థనా పూర్వకంగా ఇంగితజ్ఞానం ఉపయోగించి నిర్ణయించుకోవాలి. కొందరు వివాహ సమయానికి ముందే ప్రేమపేరుతో తొందరపడితే, మరికొందరు వయస్సు పెరుగుతున్నా రకరకాల కారణాలతో ఆలస్యం చేస్తుంటారు. ఇలా చాలామంది తమ సొంత భావనలు, అనుభూతులు, నమ్మకాలు, అభిప్రాయాల ప్రకారం నడుచుకొంటూ దేవుడిచ్చిన ఇంగితజ్ఞానం పాత్రను విస్మరిస్తున్నారు. ఈ విషయమై "...యుక్తమార్గము తప్పక నడుచుకొనువారికి ఆయన కేడెముగా ఉన్నాడు" అని బైబిల్ చెబుతుంది (సామె. 2:7). అందుకే "ఇంగితజ్ఞానం లేని చదువు ఉండడం కన్నా చదువులేని ఇంగితజ్ఞానం ఉండడం వెయ్యిరెట్లు నయం" అంటారు రాబర్ట్ ఇంజర్‌సోల్.

### 2. వాక్యంలో ఉన్న దైవ నియమాలను అర్థం చేసుకోవడం:

వాక్యంలో బయలు పరచబడిన దేవుని చిత్తం. మన వ్యక్తిగత జీవితంలో, కుటుంబంలో, సహవాసంలో, సమాజంలో ఎలా జీవించాలో దేవుడు స్పష్టంగా రాయించాడు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి, కష్టపడి పనిచేయాలి, విశ్వాసి విశ్వాసినే వివాహం చేసుకోవాలి, సంబంధాలలో సమాధానం కాపాడుకోవాలి, పరిశుద్ధంగా జీవించాలి, నోటిని, నాలుకను అదుపులో ఉంచుకోవాలి, తగ్గింపు స్వభావం కలిగి జీవించాలి, పొరుగు వారిని ప్రేమించాలి, ఇతరులను క్షమించాలి... ఇలా ఎన్నో విషయాలలో దేవుడు తన చిత్తం, ఉద్దేశాలు, నియమాలు బైబిల్‌లో తెలియజేశాడు.

కానీ చాలామంది ఇవన్నీ గ్రహించకుండా ఇంకా ఏవేవో తెలుసుకోవాలని ప్రయత్నిస్తుంటారు. తెలియజేసిన విషయాలు పాటించకుండా ప్రార్థనలు చేస్తే దేవుడు కొత్త మర్మాలు బయలు పరుస్తాడా? దేవుని వాక్యంలోని ఆజ్ఞలు, బోధ, సత్యం మనకు వెలుగు, జ్ఞానం, జీవమైయున్నాయి. వీటిని గ్రహించలేకపోవడానికి ఒక కారణం మనస్సు మారి నూతన పరచబడక ఇంకా లోక మర్యాదను అనుసరించడమే (రోమా 12:2). దేవుని వాక్యం ద్వారా మనలో ఒప్పుదల కలగాలి, దృక్పథాలు మారాలి, తీర్మానాలు చేసుకోవాలి, దేవునికోసం ప్రతిష్టించుకొని ప్రత్యేకంగా జీవించాలి. విలువలకు, సంబంధాలకు, సత్యానికి, బాధ్యతలకు, నిబద్ధతకు ప్రాధాన్యమివ్వాలి. అప్పుడు చాలా విషయాల్లో నిర్ణయాలు తీసుకోవడం సులువవుతుంది.

### 3. దేవుని నడిపింపును గ్రహించడం:

మన ఇంగితజ్ఞానం ఉపయోగిస్తూ, వాక్యం ప్రకారం నడుచుకొనే వారిని దేవుడు మిగిలిన విషయాలలో కూడా నడిపిస్తాడు. బైబిల్‌లో దానియేలు తనకు తెలిసిన దేవుని చిత్తప్రకారం తనను తాను అపవిత్రపరచుకొనకూడదని నిర్ణయించుకొని, ఇంగితజ్ఞానంతో అధికారివద్ద వినయంగా బ్రతిమాలు కొన్నాడు. అలా ఇంగితజ్ఞానం, తెలిసిన దేవునిచిత్తాన్ని అనుసరించి జీవిస్తున్న దానియేలుకు అవసరమైనప్పుడు తెలియబడని రాజు కలను, కలభావాన్ని దేవుడు బయలుపరిచాడు.

అలాగే ప్రభువైన యేసు ప్రతి ప్రాముఖ్యమైన నిర్ణయం తీసుకొనే ముందు ప్రార్థనలో సమయం గడిపాడు. చాలా సార్లు ఉపవాస ప్రార్థనలు చేసి దేవుని నడిపింపు ప్రకారం నిర్ణయాలు తీసుకొన్నాడు. ఉదా. కులాలు చూడకుండా, కట్నాలు ఆశించకుండా, సకాలంలో చదువు ముగించుకొని, శ్రద్ధగా ఉద్యోగం చేసుకొంటూ, విశ్వాసినే వివాహం చేసుకోవాలని ముందుగా నిర్ణయించుకొంటే అప్పుడు ఏ విశ్వాసిని చేసుకోవాలో వాక్యం ద్వారానో, పెద్దల సలహా ద్వారానో, పరిస్థితుల ద్వారానో స్పష్టత ఇస్తాడు. పై రెండు దశలు పాటించకుండా దేవుని నడిపింపు

కోసం ఎదురు చూస్తే మిగిలేది నిరాశ, మనలను మనం చేసుకొనే మోసం లేదా మన స్వచిత్తాన్ని దేవుని చిత్తంగా ముద్ర వేసుకొని చలామణి అవుతాము.

## నిర్ణయాలు తీసుకోవడం కష్టమనిపిస్తోందా?

"జీవితంలో నిర్ణయాలు తీసుకోవడం కష్టమయ్యేది మంచి చెడుల మధ్య కాదు, ఏవైనా రెండు మంచి వాటిని ఎంచుకోవడం మధ్యే" అంటారు జాయ్ ఆండ్రూస్. యోసేపును పోతీఫరు భార్య శోధించినప్పుడు, షద్రకు, మేషాకు, అబేద్నెగోలు రాజు ప్రతిమకు నమస్కరించకపోతే అగ్ని గుండంలో వేస్తామన్నప్పుడు, దానియేలు రాజుకు కాకుండా మరెవరికైనా ప్రార్థనచేస్తే సింహాల గుహలో వేస్తామన్నప్పుడు, మరియ వివాహం కాకుండానే గర్భం ధరించాల్సి వచ్చినప్పుడు వారికి నిర్ణయం తీసుకోవడం కష్టమవ్వలేదు. చాలా స్పష్టంగా తమ నిర్ణయాలు చెప్పారు.

కొన్నిసార్లు సరైన నిర్ణయాలు తీసుకొన్నప్పుడు నష్టం, కీడు కలిగించే ఫలితాలు ఎదురౌతాయి. అప్పుడే వారి అసలైన భక్తి బయటకు వస్తుంది. యోసేపు, షద్రకు, మేషాకు, అబేద్నెగోలు, దానియేలు, మొ॥వారు ఎదురయ్యే పర్యవసానాలు భరించడానికి సిద్ధపడ్డారు. అందుకే "క్రీస్తుయేసు నందు సద్భక్తితో బ్రతుకనుద్దేశించువారందరూ హింస పొందుదురు" (2తిమో. 3:12) అని బైబిల్ చెబుతుంది. ఒకవేళ ఎవరైనా మంచి చెడుల మధ్య తేల్చుకోలేకపోతుంటే వారు శోధనలో ఉన్నారని గ్రహించాలి. అందుకే "సరైన క్రమశిక్షణా జీవితం, మంచి విలువలు పాటిస్తూ, సాక్ష్యజీవితం కలిగి ఉండాలి. లేకపోతే శోధనలను జయించడం అంత సులువు కాదు" అంటారు ఫ్రాంక్లిన్ జోన్స్.

## కొంతమంది నిర్ణయాలెందుకు తీసుకోలేరు?

దేవుడు ప్రతి ఒక్కరికి నిర్ణయాలు తీసుకొనే స్వేచ్ఛ, ఆధిక్యత, అవకాశం ఇచ్చాడు. అయితే కొంతమందికి నిర్ణయాలు తీసుకోవడం కష్టంగా ఉంటుంది. పర్యవసానాలకు భయపడడం, సోమరితనం, సరైన అవగాహన లేకపోవడం, తప్పుచేస్తామేమో అని భయపడడం, అభ్యాసం లేకపోవడం జీవితంలో సరైన ఎంపికలు చేసుకోలేక పోవడానికి కొన్ని కారణాలు. ఇలాంటివారు ఏ నిర్ణయం తీసుకోకపోవడం కూడా ఒక నిర్ణయమేనని, దాని పర్యవసానాలు తప్పించుకోలేరని గ్రహించాలి. అందుకే "నిర్ణయం తీసుకోలేకపోవడం, అనుమానం, భయం - ఈ మూడు లక్షణాలు ఒకే కుటుంబానికి చెందినవి. ఒకటి ఎక్కడ ఉంటే మిగిలినవీ అక్కడే ఉంటాయి" అంటారు నెపోలియన్ హిల్.

మరికొంతమంది ఇళ్ళల్లో తల్లిదండ్రులు, పెద్దలు నిర్ణయాలు తీసుకొనే అవకాశాలు తమ పిల్లలకు ఇవ్వక అణచివేసి వారితరఫున వీరే అన్నీ నిర్ణయిస్తారు. మరికొందరు పిల్లలను కష్టానికి అనుమతించక అతి గారాబంగా పెంచినప్పుడు వారు బాధ్యతలు గుర్తెరగరు. కాబట్టి పిల్లలు చిన్నప్పటి నుండి వారి వయసుకు తగినంత పరిధిలో సరైన నిర్ణయాలు తీసుకొనేలా, వయసు పెరిగేకొద్దీ తమ పనులు తాము చేసుకోగలిగేలా తల్లిదండ్రులు అవకాశమిస్తూ, ప్రోత్సహిస్తూ, తర్ఫీదు ఇవ్వాలి. అలా చేయని తల్లిదండ్రులు, పెద్దలు పిల్లలకు కీడు చేస్తున్నారని గ్రహించాలి. అందుకే "బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము" (సామె. 22:6) అని బైబిల్ చెపుతుంది.

## సరైన నిర్ణయాలకు సమయం మించిపోయిందా?

అందరూ ఒకేలాంటి నిర్ణయాలు తీసుకోవాలనేదేమీ లేదు. ఎవరి నిర్ణయాలు వారివే, ఎవరి ప్రత్యేకత వారిదే. నీ నిర్ణయాలు నిన్ను రూపొందిస్తాయి, నీ ప్రత్యేకతను తెలియజేస్తాయి. అయితే ఇప్పటి వరకు తీసుకొన్న నిర్ణయాలతో నష్టపోయినా, వెనుకబాటు తనం, ఓటమి వేధిస్తున్నా, జీవితమంతా వృథాగా, వ్యర్థంగా గడచినా, నిరాశా నిస్పృహలు పట్టి పీడిస్తు న్నా, అజ్ఞానం, అవివేకం, తెలివి తక్కువతనం, బుద్ధిహీనత, భక్తిహీనత, బలహీనతలతో నీ జీవితం నిండివున్నా మంచి నిర్ణయం తీసుకోవడానికి సమయం మించిపోలేదు. సిలువపై ఉన్న ఒక దొంగ చివరి నిమిషంలోనైనా సరైన నిర్ణయం తీసుకొన్నాడు, నిత్యజీవం పొందుకొన్నాడు. సరైన నిర్ణయం ఇప్పుడైనా తీసుకోవచ్చు. మిగిలిన జీవితం ప్రయోజనకరంగా మార్చుకోవచ్చు. ఒకవేళ నీవు రక్షణ పొందకపోతే ఇప్పుడే దేవుని అంగీకరించు. పాపంతో సతమతమవుతుంటే "అట్టి మనుష్యుడు ద్విమనస్కుడై, తన సమస్త మార్గములయందు అస్థిరుడు గనుక ప్రభువువలన తనకేమైనను దొరుకునని తలంచుకొనరాదు" (యాకో1:8) అన్న వాక్యాన్ని జ్ఞాపకం తెచ్చుకొని దేవుని సన్నిధిలో పశ్చాత్తాపపడు. అందుకే "గొప్ప శుభవార్త ఏంటటే ప్రభువు కృపగల దేవుడు. ఆయన పశ్చాత్తాపానికి తప్పక ప్రతిస్పందిస్తాడు" అంటారు బిల్లీగ్రాహం.

**– విక్టర్ పిల్లి** (విజే ఆర్టికల్స్ నుంచి)

# కోశాధికారి లేఖ

## సంపూర్ణంగా దేవుని మీద ఆధారపడదాం

క్రీస్తునందు అతి ప్రియమైన యుఇయస్ఐ-ఏపి కుటుంబ సభ్యులకు, కోశాధికారులకు, ప్రార్థనా సహకారులకు మన ప్రభువైన యేసుక్రీస్తు నామంలో శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

యెహోవా ఏలీయా ద్వారా సెలవిచ్చిన ప్రకారము తొట్టిలో ఉన్న పిండి తక్కువ కాలేదు,
బుడ్డిలో ఉన్న నూనె అయిపోలేదు". 1 రాజులు 17:16.

ఏలీయా అనే పేరుకు అర్థం "యెహోవా నా దేవుడు". ఏలీయా దేవుని నామాన్ని ధరించినవాడు, మంచి సాక్ష్యజీవితాన్ని కలిగి, ఆయనే నా దేవుడు అని సాక్ష్యమిచ్చుచున్నాడు. ఏలీయా మనవంటి స్వభావం గల మనుష్యుడే. అయితే దేవుని సన్నిధిని కోరుకొంటూ ఆయన సన్నిధిని అనుభవిస్తూ ఉండేవాడు. ఏలీయా నీతిమంతుడు, ప్రార్థనాపరుడు. పరిస్థితులు ఎలా ఉన్నా సరే దేవునియందు విశ్వాసముంచినవాడు. దేవుని మాట విని విధేయత చూపినవాడు. క్లిష్టపరిస్థితుల్లో దేవుడు అద్భుతమైన విధానములో ఏలీయాను 'కాకులచేత పోషించినట్లు, సారెపతు విధవరాలిని కూడా దేవుడు కరువులో పోషించాడు. అయితే ఏలీయా తాను ప్రభువు మీద ఆధారపడుతూ, విధవరాలు కూడా ఆధారపడేటట్లు చేశాడు. కనుక ఆమె, ఆమె ఇంటివారును దేవునిచేత పోషింపబడుతూ వచ్చారు. దేవుని సెలవు ప్రకారము పిండి తక్కువ కాలేదు, నూనె అయిపోలేదు. కరువులో కూడా సమృద్ధి ఉంది.

ఎన్నో రకాల బాధలతో, వ్యాధులతో, ఒత్తిడితో జీవిస్తున్న దినాలలో మనము ఉన్నాము. అయినా ప్రతినెలా మన అవసరాలు తీరుతున్నాయి. దేవుని మాట చొప్పున జీవిస్తూ ఉన్నాము కనుక గత సంవత్సరాల్లో అనేక విధాలుగా ప్రభువు చేత పోషించబడుతున్నాము. యుఇయస్ఐ-ఏపి ఎంతగా ప్రభువుకు లోబడితే అంతగా దేవునిచేత పోషించబడుతూనే ఉంటుంది. గనుక ప్రతి అవసరానికి ఆయన మీద సంపూర్ణంగా ఆధారపడదాం, ఆయన ఆజ్ఞలను గైకొందాం.

*గమనిక: ఏసియం-2021 నిర్ణయం ప్రకారం ఇయు, ఇజియఫ్‌లలో ధనం మిగిలుంటే దానిలో అవసరాల నిమిత్తం 20% ఉంచుకొని మిగిలినది నంబూర్ ఆఫీస్‌కు పంపగలరు.*

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి
2. ప్రేయర్ హట్ పూర్తయి ఫిబ్రవరి 20 తేదీన దాన్ని ప్రారంభించడానికి ప్రభువు చూపిన కృపను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2021 తర్వాత పెరిగిన 18% బడ్జెట్‌కు అనుగుణంగా 30 ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపిస్తున్నాయి. వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. మిగిలిన ఇజియఫ్‌లు కూడా ప్రార్థించి సహకరించవలసిందిగా కోరుచున్నాము.
2. యుఇయస్ఐ నేషనల్‌కు ప్రతి నెల ఆఫీసునుంచి పంపే కాంట్రిబ్యూషన్స్ 75,000/- నుంచి 80,000/- రూ. పెంచడానికి స్టేట్ యాన్యువల్ కౌన్సిల్‌లో నిర్ణయించారు. పెరిగిన 5,000/- కొరకు
3. స్టైరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
4. యాన్యువల్ ఇంక్రిమెంట్, నూతన కో-ఆర్డినేటర్స్ నియామకాల వలన అవసరమైన అదనపు ధనం 60 వేల కోసం
5. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,20,000/- కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు

**యస్.ఆర్.డి. కిషోర్ కుమార్**

**AP MONTHLY REQUIREMENT – Rs. 11,10,000/- (18% Hike W.R.T present income)**

**JANUARY 2021**

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | 8,390.00 | Field Staff Salaries | 4,51,416.00 |
| General Fund | 10,49,796.00 | Field Staff HRA, CA, MA & TA | 2,09,738.00 |
| Staff Support | 27,600.00 | Office Staff Salaries | 1,65,745.00 |
| Rajasthan | 10,000.00 | UESI | 80,000.00 |
| | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | APEGF | 3,000 |
| | | SWF | 1,09,000 |
| | | Office Expenditure | 31,415.00 |
| | | Closing Balance | 472.00 |
| **Total** | **10,95,786.00** | | **10,95,786.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-02-2022**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508

# మేలుకో... మగువా



నరుని నుండి తీయబడిన నారి
ఈ సృష్టికే మాతృమూర్తివి
సాటియైన సహకారి
మిన్నయైన స్నేహశీలి

అపవాది కుయుక్తులను పసిగట్టలేక
దేవుడిచ్చిన స్వేచ్ఛను
దుర్వినియోగం చేసి దగాపడ్డావు
ఘోర పతనానికి నాందియైనావు
పాపం నిన్ను పడద్రోసింది
తిరుగుబాటు నీ విలువను త్రుంచేసింది
దేవునికి నిన్ను దూరం చేసింది
పాపానికి బానిసగా మార్చింది
తరతరాల పురుషాధిక్య అహంకారానికి
బలి అవుతూనే ఉన్నావు
మూఢ సంస్కృతి, కట్టుబాట్లకు బంధీ అవుతూనే
ఉన్నావు

ఆది స్త్రీకి వాగ్దాన నెరవేర్పుగా
క్రీస్తు నీ గర్భాన జన్మించి
నీ తలను పైకెత్తాడు
ఏదేనులో నీతోపాటు సృష్టి పొందిన శాపాన్ని
గొల్గొతాలో ప్రభువు పరిష్కరించాడు
'అమ్మా" అని పిలిచి
నీ అవమానాన్నంతటినీ పటాపంచలు చేశాడు!
ఆయనను నీ హృదిన చేర్చుకొన్న
నీవే నవయుగ సమాజ నిర్మాతవు

దేవుని తొలి వాగ్దానాన్ని పొందిన
పునరుత్థానుడైన క్రీస్తును ప్రథమంగా చూసిన
ప్రభువు శిష్యగణంలో ప్రముఖ పాత్ర పోషించిన
ఘనాపాటివైన నీకు
ఆ ఘనతను సంఘము, సమాజము గుర్తించకపోయినా
నీ ఆత్మీయ మౌన ప్రయాణాన్ని ఎన్నడూ ఆపలేదు
పరిచర్యలో వెనుదిరిగి చూడలేదు!

అత్యుత్సాహంలో దారి తప్పిన దీనాలు
రాబంధువుల కాముకత్వానికి బలౌతున్న తామారులు
క్షణికానందాన్నిచ్చే పాపపు సంబంధాలలో బంధీయైన
యువతలెందరో
సమస్యల సుడిగుండంలో చిక్కుకొన్న సమరయ స్త్రీలు
నీ చుట్టూ ఉన్నారు . . . .

రూతువంటి దృఢ విశ్వాసంతో
దెబోరావంటి ధైర్యసాహసాలతో
హన్నావంటి విజ్ఞాపనతో
ప్రిస్కిల్లావంటి పరిచర్యతో

మేలుకో మగువా, మలచుకో జీవితాన్ని
ప్రభువు కోసం వెలుగుతూ
మారుతున్న మహిళా లోకాన్ని
ప్రభువుకోసం గెలుచుకో

– మల్లీశ్వరి, దర్శి